సర్పపురమాహాత్మ్యము

కూచిమంచి తిమ్మన

శ్రీరస్తు

కూచిమంచి తిమ్మకవిసార్వభౌమునిచే విరచితంబు

సర్పపురమాహాత్మ్యము

రా. నరసయ్యశాస్త్రులవారిచే
లేఖకప్రమాదాదిజనితదోషరహితంబులుగఁ
బరిష్కరింపఁబడి

చెన్నపురి
వేమూరు వెంకటకృష్ణమసెట్టి అండ్ సన్సుచే
ఆనందముద్రాక్షరశాలయందు ముద్రింపింపఁబడి
ప్రకటింపఁబడియె.
1896.

[Copyright Registered.]

పీఠిక

పూర్వకథారచనాయోగంబునం బ్రసిద్ధి గాంచిన సర్పపురమాహాత్మ్యంబును నచ్చతెనుఁగుంగబ్బములలో నొక్కఁ డై వన్నెకెక్కిననీలాసుందరీపరిణయంబును శ్రీమత్కూచిమంచితిమ్మకవిప్రణీతములు, ఈతిమ్మయ లోకంబున నభినవవాగనుశాసనుఁ డనియుఁ గవిసార్వభౌముఁ డనియు బిరుదులఁ గాంచినమహాకవి.

ఇతఁడు నియోగిబ్రాహ్మణుఁడు; కౌండిన్యసగోత్రుఁడు. బయ్యనామాత్యుని మునిమనుమఁడు. ఇతనిపితామహుఁడు తిమ్మయ, తండ్రి గంగనామాత్యుఁడు. తల్లి లక్ష్మమ. జగ్గన సింగన నరసనయు నితని పెదతండ్రులు, వీరమ పాపమయును మేనత్తలు. రాజనయు జగ్గనయు సూరనయు సహోదరులు. తిమ్మనయు సింగనయుఁ బెదతండ్రికొడుకులు. భార్య బుచ్చమ. ఈతనినివాసస్థలము గోదావరీమండలమందలి[1]పీఠికాపురసంస్థానములోని కందరాడ యనుగ్రామ మనియు నితఁ డాయూరికరణ మనియుఁ దెలియవచ్చెడినీ. ఇతఁడు పుట్టి పెరిఁగినతావు చంద్రమపాలెము.

ఇతఁడు దెందులూరిలింగనారాధ్యదేశికేంద్రదత్తమాహేశ్వరాచార్యవృత్తిరతుఁ డైనను గేవలశైవుఁడు గాక యద్వైతమతమే యవలంబించినట్టు లితనిగ్రంథములవలనఁ దెలియ వచ్చుచున్నది. కావుననే భావనారాయణస్వామి తిమ్మకవికి స్వప్నమునందు సాక్షాత్కరించి.

> “శివునకు నాకును భేదము యవమాత్రము లేదు. ... ...
> కృతులు శంభునికిడినసత్కీర్తి వీవు ప్రతిభ మెఱయంగ నొక్కసత్కృతి నొనర్చి
> మాకు నర్పణసేయు.”

మని కోరఁగా గ్రంథమును రచించి యాదేవునకు సమర్పించినట్టు లీసర్పపురమాహాత్మ్యములోఁ దెల్పఁబడియున్నది.

ఈకవి పీఠికాపురసంస్థానమునకుఁ బ్రభువైన రావుమాధవునికాలములో నుండి కృతులు వ్రాసి కవిసార్వభౌముఁడు లోనుగా బిరుదులం బడసియున్నట్లు తెలియుచున్నది. ఈతని రెండవకృతి యగురుక్మిణీపరిణయము హూణశకము 1715 వ సంవత్సరమున రచియింపఁ బడియుండుటచేతను నీతనికడపటికృతి యగు శివలీలావిలాసము హూణశకము 1758వ సంవత్సరమందుఁ జేయఁబడియుండుటచేతను నీతిమ్మకవి హూణశకము పదునెనిమిదవశతాబ్దారంభమునకుఁ గొంచెము పూర్వము జనించి తచ్ఛతాబ్దమధ్యముదాఁక జీవించియుండినట్టు గనఁబడుచున్నది.

శ్రీసర్పపురక్షేత్రమాహాత్మ్యము.

పద్యప్రబంధము కూచిమంచి తిమ్మకవి కృతము.

ఇది ‘అభినవవాగనుశాసనుఁడు’ ‘కవిసార్వభౌముఁడు’ అను బిరుదము లంది క్రీ. శ. 17, 1 శతాబ్దముల మధ్యకాలమున విలసిల్లిన కూచిమంచి తిమ్మకవి క్రీ. శ. 1754 సంవత్సరము రచించినప్రబంధము. ఇందలి కథాభాగము బ్రహ్మకైవర్తపురాణోక్త మైనసర్పనగరక్షేత్రమాహాత్మ్యమునకు ఆంధ్రీకృతి. అంబరీషచక్రవర్తియాస్థానమునకు వసిష్ఠమహర్షి విచ్చేసినపుడు అంబరీషుఁ డాతనిం బూజించి కుశలసంభాషణానంతరము ‘సర్పపురాఖ్యాన మెట్టిది? భావనారాయణ వుఁ డట నేల యుదయించె? ఆదేవు నచట నెవ్వరు ప్రతిష్ఠించిరి? అందలిపుణ్యసరోవరము లెవ్వి? ఆతీర్థములఁ గ్రుంకులిడిపఫల మెట్టిది?’ అని యడుగఁగా వసిష్ఠుఁ డీమాహాత్మ్యము నుగ్గడించెను.

ఈసత్ప్రబంధమును దొలుత నీలాసుందరీపరిణయముతోఁ గలిపి వావిళ్ళవా రెపుడో ముద్రించిరి. ఆ తరువాత నిదియే ద్వితీయముద్రణమై యుండును. కూచిమంచి తిమ్మకవి మహాకవిసార్వభౌముఁడు. ఈతని కవిత్వము ఏనుఁగు లక్ష్మణకవిమాటలలో:

“హాటక గర్భవధూలీ
లాటన చలితాంఘ్రి నూపురారావ శ్రీ
పాటచ్చరములు తేనియ
తేటలు మాకూచిమంచి తిమ్మయమాటల్.”

కవిత్వమా మృదుమధుర మైనది. కావ్యవస్తువా పరమపవిత్రమైనది. కాకినాడకు రెండుమైళ్ళలోఁ గలయీపవిత్రక్షేత్రమాహాత్మ్య మెల్లరకుఁ బారాయణయోగ్యము. ఈయుత్కృష్టప్రబంధమును జక్కనికాకితములపైఁ జక్కఁగా ముద్రించి ప్రకటించిన శ్రీ సర్వవరదేవస్థాన ట్రస్టీ లభినందనీయులు.

ఇట్టి గ్రంథమున కొకసమగ్ర మగుపీఠిక, తేటతెల్ల మగుకథాసంగ్రహము సమర్థుఁడగుపండితునిచే వ్రాయించి చేర్చి యుండినచో గ్రంథగౌరవ మినుమడించి యుండెడిది. ప్రాచీనప్రబంధముల నచ్చువేయించి ప్రకటించువా రిట్టిపీఠికాదుల విలువ గ్రహింపక పోవుట పెద్దలోపము.

(గ్రంథపాతము)

---

[1] పీఠికాపురమునకె పీఠీపురమనియుఁ బీఠపుర మనియు నామాంతరములు. ఇప్పుడు పిఠాపుర మని ప్రసిద్ధి.

శ్రీశారదామ్బాయై నమః

సర్పపురమాహాత్మ్యము

ప్రథమాశ్వాసము

(గ్రంథపాతము)

ఉ. పాయక తమ్మిగద్దె ననపాయసుఖోన్నతి నుండి దేవతా
నాయకముఖ్యులున్ మునిజనప్రవరుల్ గొలువన్ జగంబు ల
త్యాయతలీల నేలుచతురాననుఁ డాదరణైకబుద్ధి దీ
ర్ఘాయురభీప్సితార్థము లుదారత మాకు నొసంగుఁగావుతన్. ||5||

శా. పాణిద్వంద్వము మోడ్చి మ్రొక్కిడుదు శుంభద్బంభరీవేణికిన్
మాణిక్యాంగదమేఖలావలయసమ్యగ్భూషణశ్రేణికిన్
వీణాపుస్తకపాణికిన్ సురుచిరోర్వీభృళన్నిభశ్రోణి క
క్షీణక్షేమకటాక్షరక్షితమహాగీర్వాణికిన్ వాణికిన్. ||6||

చ. కరములఁ దోయిలించి కుతుకంబున నిచ్చలుఁ బ్రస్తుతింతు భా
స్వరగుణవంతునిన్ సకలసత్కవిజాలవనీవసంతునిం
జిరకరుణానిశాంతుని విశిష్టజనావనసుప్రశాంతునిన్
సుగతరుమంజరీనిభయశోహరిదంతుని నేకదంతునిన్. ||7||

చ. ముదమునఁ గేలుఁదామరలు మోడ్చి నమస్కృతు లాచరింతు బ
ల్లిదుఁ డగు దెందులూరికులలింగయసద్గురునాథమౌళికిన్
సదమలశీలికిం ద్రిపురసంహరపాదసరోరుహాళి కు
న్మదపరవాదిమండలత మస్సముదాయమయూఖమాలికిన్. ||8||

సీ. గురుతరకౌండిన్యగోత్రవిఖ్యాతుండు, బయ్యనామాత్యుఁ డేప్రభునితాత
నిరతాన్నదానవర్ణితయశస్సాంద్రుండు తిమ్మనసచివుఁ డేధీరుతండ్రి
ఘనులు జగ్గనయు సింగనమంత్రియును నరసన్నయు నేధన్యునసుజవరులు
తిమ్మయాఖ్యుఁడ నేఁ బ్రథితులు సింగనయు జగ్గనయు సూరనయు నేయనఘుసూను
తే. లతులమతి రాజమాంబ యేయధిపుజనని, యతిపతివ్రత లక్ష్మి యేచతురురాణి
యట్టిశ్రీకూచిమంచివంశాభిచంద్రు, మజ్జనకు గంగనామాత్యు మదిఁ దలంతు. ||9||

తే. వ్యాస వల్మీకభవ కాళిదాస మాఘ, చోర భారవి బాణ మయూర భోజ
దండి భవభూతి ముఖ్యవిద్వత్కవీంద్ర, శేఖరుల నెంతుఁ గావ్యసంసిద్ధికొఱకు. ||10||

ఉ. నామది నెప్పుడుం దలఁతు నన్నయఁ దిక్కన నెఱ్ఱపెగ్గడన్
భీమకవీంద్రు భాస్కరుని వీరకవీంద్రుని రంగనాథునిన్
సోమునిఁ బోతసత్కవిని సువ్రతు లై బహుళాంధ్రకావ్యముల్
నేమ మెలర్పఁ జెప్పి యవని న్నుతి గన్నమహానుభావులన్. ||11||

క. కుకవు లనువారు గలుగఁగ, సుకవులకుఁ బ్రకర్ష గలిగె సులభంబుగ నూ
రకయ భువనోపకృతులఁ, గుకవుల నిరసింపవలదు గుణమాన్యులకున్. ||12||

వ. అని నిఖిలదేవతాప్రార్థనంబును గురుచరణస్మరణంబును మహాకవివర్ణనంబును గావించి
యే నొక్కపుణ్యచరిత్రంబు రచియింపంబూనియున్నసమయంబున నొక్కనాఁడు. ||13||

స్వప్నవృత్తాంతము

సీ. తెలిదమ్మిరేకులఁ దెగడుకన్నులవాఁడు, తొగవిందు నగుముద్దుమొగమువాఁడు
పలుమురియును జుట్టువాలుఁ బూనినవాఁడు, సిరియు మచ్చయు నెద బెరయువాఁడు
తొలుమొగుల్ తెగజిగి దొరయునెమ్మెయివాఁడు, జాళువాహొంబట్టు సాలువాఁడు
బలుదమ్మికెంపుజాపతకంబు గలవాఁడు, వలటేని గమకించుచెలువువాఁడు
తే. చొక్కటపుఁబక్కిరాజక్కి నెక్కువాఁడు, సర్పపురినుండి జగములు సాఁకువాఁడు
భావనారాయణుఁడు మహాప్రభుఁడు నాకు, నెలమిఁ గలలోనఁ బొడగట్టి యిట్టు లనియె. ॥ 14॥

సీ. ప్రౌఢిమై రుక్మిణీపరిణయంబును సింహ, శైలమాహాత్మ్యంబు నీలపెండ్లి
కథయును రాజశేఖరవిలాసంబును, నచ్చతెనుంగురామాయణంబు
సారంగధరనరేశ్వరచరిత్రంబు స, ప్తార్ణవసంగమాహాత్మ్యకంబు
రసికజనమనోభిరామంబు లక్షణ, సారసంగ్రహము నింపారఁ గూర్చి
తే. కృతులు శంభున కిడినసత్కృతివి నీవు, ప్రతిభ మెఱయంగ నొక్కసత్కృతి యొనర్చి
మాకు నర్పణసేయు నెమ్మది దలిర్పఁ, దిమ్మకవిచంద్ర ముదితసుధీకులేంద్ర. ॥15॥

క. శివునకు నాకును భేదము, యవమాత్రము లేదు నేనె యతఁ డాతఁడ నే
నవిరళమతి సర్పపుర, ప్రవిమలమాహాత్మ్య మాంధ్రభాషం జెపుమా. ॥16॥

వ. అని యానతిచ్చి యప్పరమేశ్వరుం డంతర్హితుం డైన నేను నత్యంతసంతుష్టాంత
రంగుండనై. ॥17॥

షష్ఠ్యంతములు

క. నారదమునిపూజితపద, నీరజునకు సకలభువననిర్మాణకళా
పారగునకు నతజనసుర, భూరుహునకు విమతభయదభుజసారునకున్. ॥18॥

క. కలశాబ్ధికన్యకాకుచ, కలశాంకితగంధసారఘనసారవిని
ర్మలసౌరభసంవాసిత, కలితోన్నతవక్షునకుమ గమలాక్షునకున్. ॥19॥

క. శారదనీరదనారద, పారదనీహారహారపాటీరసుధా
పూరదరాంచితయశున క, పారదయాస్వాంతునకును భగవంతునకున్. ॥20॥

క. పతగాధిపకేతనునకు, శతధృతిముఖనిఖిలదివిజసంఘాతప్ర
స్తుతచరణసరోరుహునకు, శ్రితజనహితచరితునకును జితదురితునకున్. ॥21॥

క. స్వర్పతినుతచరణునకున్, దర్పోద్ధతదనుజకులవిదారణునకుఁ గం
దర్పాయుతసుందరునకు, సర్పపురాధీశునకును జగదీశునకున్. ॥22॥

వ. సమర్పణంబుగా నారచియింపం బూనిన సర్పపురక్షేత్రమాహాత్మ్యం బనుపుణ్య
చరిత్రంబునకుం గథావిధానం బెట్టి దనిన. ॥23॥

కథాప్రస్తావన

క. శ్రీకమలాధిపపదనా, ళీకధ్యానానుమోదలీలానిరతా
స్తోకమహిమాతిశయదూ, రీకృతభవదోషుఁ డంబరీషుఁడు దనరున్. ॥24॥

తే. ఆమహీపాలకులసార్వభౌముఁ డొక్క, నాఁడు వేడుకతో సభాంతరమునందు
సకలబుధబాంధవామాత్యసహితుఁ డగుచుఁ, దవిలి పేరోలగం బున్నయవసరమున. ॥25॥

క. ఘనుఁడు వసిష్ఠమహాముని, చనుదెంచిన నతని కెదురు చని నతులిడి తో
డ్కొని తెచ్చి యర్ఘ్యపాద్యము, లొనరఁగ నిడి యుచితపీఠి నునిచి కడంకన్. ||26||

ఆ. కొంతదడవు విహితగోష్ఠి సంభాషించి, యంత మౌనిఁ జూచి యవనివిభుఁడు
భువనవంద్య సర్పపురమహాక్షేత్రమా, హాత్మ్య మే వినంగ నభిలషింతు. ||27||

సీ. అరయంగ సర్పపురాఖ్యాన మెట్టిది, భావనారాయణదేవుఁ డచట
నేమిటి కుదయించి యిల నున్నవాఁడు త, ద్దేవు నెవ్వాఁడు ప్రతిష్ఠ చేసి
నందులఁ గల్గుపుణ్యసరోవరము లెవ్వి, యత్తీర్థములఁ గ్రుంకులాడినట్టి
ఫల మది యెట్టిది ప్రాచుర్యముగ నిది, విన డెందమునఁ జాల వేడ్క యొదవె
తే. నీసమస్తంబు దెలియ నా కెఱుఁగఁ జెప్పు, వలయు నని వేఁడుకొనిన నవ్వసుమతీశుఁ
గాంచి మునిమౌళి నెయ్యంబు గడలుకొనఁగ, నలర విను మనియిట్లని దెలుపఁదొడఁగె. ||28||

సీ. ఘనమౌనిమఘధూమకనదంబుదస్తోమ, శేముషీపరినటచ్ఛిఖివరంబు
పరమతత్త్వవిచారపాండిత్యనైపుణీ, విగతవైరసమస్తమృగకులంబు
గంధర్వగజరాజగామినీజనచిత్ర, సంగీతముదితభుజంగమంబు
విమలమేధోదితవేదశాస్త్రపురాణ, పఠనసముల్లసత్పతగచయము
తే. లాలితోత్తాలదివ్యరసాలసాల, పల్లవలవానుభవమత్తపరభృతౌఘ
మాధురీధుర్యనినదసమాకులంబు, పుణ్యగణ్యంబు నైమిశారణ్య మలరు. ||29||

క. గాలవ కౌశిక కలితో, ద్దాలక శాండిల్యముఖ్యతతపుణ్యతరుల్
లీలం గ్రాలఁగ శుభఫల, మూలంబై యవ్వనంబు మురువున నలరున్. ||30||

తే. అవ్వనంబున వేదవేదాంతవిదుఁడు, భగవదంఘ్రిసరోరుహభక్తియుతుఁడు
ఘనుఁడు విజితేంద్రియుఁడు జితకాముఁ డనఘుఁ, డలరు శౌనకుఁ డనెడుమహర్షివరుఁడు. ||
31||

సీ. హరిపదధ్యానతత్పరులు గొందఱు గొంద, ఱవిరళాచ్యుతకథాశ్రవణనిరతు
లశ్రాంతజపపరాయణులు గొందఱు గొంద, ఱగ్నికార్యనిరంతరాభిరతులు
నిగమాగమాంతపారగులు గొందఱు గొంద, ఱబ్జాక్షపూజనాయత్తమతులు
సతతయోగాభ్యాసచరులు గొందఱు గొంద, ఱఖిలపురాణరహస్యవిదులు
తే. నగుచు భగవద్గుణస్మృతి నహరహంబు, నగుచు నాడుచుఁ బాడుచు మిగులవేడ్క
నశ్రుకణముల నెరపుచు నమ్మహాత్ము, సభఁ జరింతురు పరమర్షిజనులు లీల. ||32||

తే. వచ్చె నచ్చెరువార నవ్వనమునకును, సకలజనవంద్యుఁ డగుకుంభసంభవుండు
మాధవార్పితహృదయతామరసుఁ డైన, యమ్మహాముని దర్శించు నభిమతమున. ||33||

వ. అట్లు వచ్చి. ||34||

తే. గోమతీతీరమందారభూమిరుహస, మీపవిధుకాంతమణివేదిమీఁద మోద
మమర నాసీనుఁడై సహస్రాంశుఁ బోలి, యున్నయమ్మునిఁ గని ద్విజు లుత్సవమున. ||35||

క. వందనము లిడి యమందా, నందంబున నపుడె క్రన్ననం బరువిడి తా
రందఱు శౌనకునకు నా, చందం బెఱిఁగింప నతఁడు సంతస మెసఁగన్. ||36||

క. కడువడి నరిగి యగస్త్యునిఁ, బొడగని యర్ఘ్యాదివిధులఁ బూజించి నయం
బడర నతు లొసఁగి యాతనిఁ, దొడుకొని తనమనికి కెలమి తోడం జనియెన్. ||37||

క. చని యర్హాసనమున న, య్యనఘుం గూర్చుండఁజేసి యతనియనుజ్ఞన్
వినయాసనతుండై తా, నును దగఁ గూర్చుండి పలికె నూల్కొనుభక్తిన్. ||38||

సీ. మునినాథ విస్మయంబుగ మీర లిందు వేం, చేయుటకతన నేఁ జేసినట్టి
తపము సిద్ధించె నెంతయుఁ గృతార్థుఁడ నైతి, సరగ నాజన్మంబు సఫల మయ్యె
మీపదస్పర్శచే మేటిపుణ్యంబుల, కాకరం బయ్యె మదాశ్రమంబు
భవదీయదివ్యకృపానిరీక్షణమున, నిఁక నాకు దుర్లభం బెద్ది కలదు

తే. నేను నీయాజ్ఞ దలమోచి నిచ్చ నిచ్చ, మెలఁగువాఁడ నటంచు నర్మిలి వచించు
శౌనకునిఁ జూచి యక్కుంభసంభవుండు, పలికె నిట్లని సాంత్వనభాషణముల. ||39||

క. నినుఁ బొడగనుకోరికచే, మునివర నే వచ్చినాఁడ ముదమున నిటకున్
విను మింతటికన్నఁ బ్రయో, జన మేమియు లేదు నాకుఁ జర్చింపంగన్. ||40||

క. హరిసందర్శనమును శ్రీ, హరిభక్తులదర్శనంబు నక్షులకు ఫలం
బరయఁగ శ్రవణంబులకుం, బరువడిఁ దత్కథలు వినుట ఫలము మునీంద్రా. ||41||

సీ. మత్సరు లెల్ల నిర్మత్సరు లగుదురు, రాగాన్వితులు వీతరాగు లగుదు
రజ్ఞు లెల్లను జ్ఞాను లగుదురు నిస్స్పృహు, లగుదు రెంతయు స్పృహయాళు రెల్ల
మహనీయభవదాశ్రమస్థలసంపర్క, మున నని విశ్రుతంబుగ ధరిత్రి
నెన్నంగఁబడుటచే నే నిది గనుఁగొన, నరుగుదెంచితిఁ ధన్య మయ్యె నేఁడు
తే. తాపసోత్తమ నీమహత్త్వంబు దలఁప, నరిది యని పల్కుటయు వేడ్క నలరి కుంభ
సంభవునిఁ జూచి వేఁడి యా శౌనకుండు, మృదుమధురవాక్ప్రవీణత మెఱయఁ బలికె. ||42||

తే. యతికులోత్తంస వినుము తత్త్వావబోధ, శీలుఁడవు నీవు నేఁడు వేంచేసి యిందు
నడుగుపెట్టినకతన మీ రమర ననిన, యట్ల కాఁగల దిఁక సంశయంబు లేదు. ||43||

వ. అనిన నగస్త్యుం డిట్లనియె. ||44||

తే. సర్వలోకేశ్వరేశుఁడు సర్వకర్త, యఖిలకల్యాణసాగరుఁ డమలమూర్తి
యాదినారాయణుం డాత్మ నతనిఁ దలఁచు, జనుఁ డశేషమహాకిల్బిషములఁ బాయు. ||45||

సీ. కన్నులు భవదంఘ్రికములదర్శనమున, మృదుకరస్పర్శఁ ద్వగింద్రియంబుఁ
ద్వత్పదాంబుజసుగంధమున ఘ్రాణేంద్రియం, బును గడుసంతుష్టిఁ బొందె నింకఁ
జెవులు మీవాక్యవైభవము వినంగను, రసన మీవాక్సుధారసముఁ గ్రోల
నభిలషించుచు నున్న వనఘాత్మ సర్వేంద్రి, యసుఖావహం బయ్యె నఖిలశుభఫ
తే. లములు నొనగూడె భవదాగమమున మాకు, ననుచు నత్యంతవినయజ్ఞుఁ డగుచు నాడి
కలశభవుఁ దద్ద సంప్రీతుఁగా నొనర్చి, యెలమి దైవాఱఁ గ్రమ్మఱ నిట్టు లనియె. ||46||

వ. మహాత్మా విశ్వేశ్వరుండును విశ్వయోనియు విశ్వస్రష్టయు జగత్ప్రభుండును ననాది నిధనుండును శ్రీమంతుండును భగవంతుండును నగు పురుషోత్తముండు సర్వగతుం డై యుండియుఁ బ్రణామార్చనాదివిధంబుల నచటనచ్చట గోచరుండై ప్రతిష్ఠాపనా మాహాత్మ్యంబున క్షేత్రప్రభావంబున నరకప్రీతివశంబునఁ బూజాధికృత్యంబున సాక్షాత్కరుం డగుచుండు నని పౌరాణికజనంబువలన వినంబడుచుండుఁ బుణ్యశ్లోకుం డును మహాభాగుండు నగునజ్జనార్దనుండు విశేషించియు నెచటనెచ్చట నధివసించి ప్రకాశించుచుండుఁ బురాణజ్ఞుండవు సమర్థుండ ననఁబరగునీవలన నేతత్ప్రకారంబు వినవలయు నని మనంబునం గౌతుకంబు విస్తరిల్లుచున్న యది నీ విది నాకుం దేట తెల్లంబుగా నెఱింగింపవలయునని పార్థించిన విని యగస్త్యమహామునీంద్రుఁ డతని కిట్లని తెలుపందొడంగె. ||47||

కథారంభము

క. ధాత్రి న్మునివర విష్ణు, క్షేత్రంబులు పెక్కుగలవు సిద్ధం బీష
న్మాత్రం బెక్కువ యగు నొక, క్షేత్రము గల దది యెఱుంగఁ జెప్పెద వినుమా. ||48||

తే. పుడమి గోదావరికిఁ దూర్పుకడను దుల్య, భాగకు నుదక్తటంబునఁ బశ్చిమమున
వారిరాశికిఁ గోసెఁడుమేర సర్ప, పురమహాక్షేత్ర మభిరామ గరిమ నలరు. ||49||

తే. పుణ్యకాసారసహితంబు పుణ్యశీల, సంస్కృతము పుణ్యకాంతాప్రశస్త మగుచు
సర్వకామార్థదాయియై సర్పపురము, ఖ్యాతి నెలకొందు మూఁడులోకములయందు. ||50||

క. నరుఁ డాక్షేత్ర మొకప్పుడు, పరువడి స్మరియింప విడుచు భవబంధము లా
సరసీజలముల మునిఁగిన, దురితౌఘము లెట్టి వైనఁ దొలఁగు మునీంద్రా. ||51||

తే. నారదసరోవరంబు ననంతసరసి, ముక్తికాసారమును నన మూఁడుతీర్థ
ములు తరింపఁగఁజేయుఁబో తలఁచినపుడె, సర్వదురితపూర్ణు లౌ జంతువులను. ||52||

తే. వరదుఁడు కృపాంబునిధి భక్తవత్సలుఁడు, భావనారాయణుండును దేవుఁ డచటఁ
దనర నారదమునికులోత్తమునిచేత, నున్నతిఁ బ్రతిష్ఠితుం డయి యున్నవాఁడు. ||53||

క. మందారశాఖతెఱఁగున, వందారుకజనుల నెల్ల వరఫలముల నా
నందింపఁగఁ జేయుచు హరి, యందంబుగ బుధులు పొగడ నం దుండుఁజుమీ. ||54||

చ. అనుటయు శౌనకుండు వినయాన్వితుఁడై కలశోద్భవుం గనుం
గొని మునివాథ నారదుఁడు కోరిక నేమిటి కందు సజ్జనా
ర్దనునిఁ బ్రతిష్ఠ చేసె విదితంబుగ నచ్చటఁ గల్గియున్నపా
వనసరసీత్రయంబుఘనవైభవ మెట్టి దెఱుంగఁ జెప్పవే. ||55||

శేషుఁడు తపం బొనర్చుట

క. అన నాఘటభవుఁ డిట్లను, మును కశ్యపుఁ డనెడు పరమమునికిం గద్రూ
వనితకుఁ బుట్టినవేవురు, తనయులుఁ బటుసర్పరూపధరు లబ్రముగన్. ||56||

తే. వారిపైఁ దల్లి కొండొకకారణమున, నలిగి శపియింప నందఱు నగ్నితప్తు
లై కృశించుచు నున్నచోట నం దనంతుఁ, డనెడుభుజగేంద్రుఁ డొకఁడు రయంబ వెడలి. ||57||

క. ధరఁ గల పుణ్యస్థలములు, దిరిగి తిరిగి మరలి యుదధితీరంబున శ్రీ
హరి నచ్యుతు నభవు రమే, శ్వరు గూర్చి మహోగ్రతపము సలుపఁదొడంగెన్. ||58||

తే. కుముదకహ్లారకువలయవిమలకమల, సారసౌరభసహితకాసారతీర
మున ననేకాబ్దములు నిష్ఠ పూని ఘోర, తపము గావించె దివిజబృందములు పొగడ. ||59||

శా. ఆక్షీణోగ్రతపస్సమాధి నటు నిద్రాహారముల్ మాని య
బ్జాక్షశ్రీపదపంకజాతయుగళ ధ్యానావగాఢాత్ముఁ డై
దీక్షంగ్రాలుచు నున్నచో హరి రమాధీశుండు విష్ణుండు దా
సాక్షాత్కారముఁబొందె నభ్రమున నాచక్షుఃశ్రవస్స్వామికిన్. ||60||

సీ. శంఖచక్రగదాసిశార్ఙ్గాయుధములతో, భవ్యజాంబూనదాంబరముతోడ
వనమాలికావృతవక్షస్థలంబుతో, గౌస్తుభశ్రీవత్సకములతోడఁ
బద్మరాగాశ్మశుంభత్కిరీటంబుతో, నవరత్నమయభూషణములతోడ
సురుచిరహరినీలశోభితాంగంబుతో, నండజాధీశవాహనముతోడ
తే. నెలమిఁ బ్రత్యక్షమై మ్రోల నిలిచియున్న, యాదినారాయణునిఁ బరమాత్ముఁ గాంచి
యలర దండప్రణామంబు లాచరించి, యురగకులభర్త దల వాంచి యూరకుండె. ||61||

తే. అపుడు కరుణాపయోనిధి యైనశౌరి, వానిఁ గన్గొని యిట్లను వత్స యిచట
నిట్టిదుష్కరతరతపం బేల చేసె, దెవ్వఁడవు నీవు నీకోర్కి యెద్ది చెపుమ. ||62||

క. ఉరగా నీతపమునకుం, బరితోషము నొంది యేను బరువడి నీకున్
వర మీ వచ్చితి నడుగుము, కర మరుదుగ నెద్దియైనఁ గడపక యిత్తున్. ||63||

వ. అని పరమదయాళుండును భక్తవత్సలుండును నగుభగవంతుఁ డానతిచ్చిన హర్షోత్ఫుల్ల
నేత్రుండును బులకితగాత్రుండును సమాహితచిత్తుండును నగుచు ననంతుం డద్దేవు
నిట్లు వినుతింపఁదొడంగె. ||64||

తనకు సాక్షాత్కరించిన విష్ణువును శేషుఁడు పొగడుట

రగడ. జయ ముకున్ద సమస్తతాపన జనమనోజ్ఞమిళిన్దనాయక
భయదరక్షోనాథవక్షః పాటనోద్ధతనఖరసాయక
సజలజలదపురన్దరోపల సదృశమఞ్జుళదివ్యవిగ్రహ
అజసహస్రవిలోచనముఖామరావళీలసదనుగ్రహ
కలశనీరధికన్యకాముఖ కమలతరుణసరోజబాన్ధవ
బలవదణ్డజమణ్డలాధిప భాసమానమనోజ్ఞసైన్ధవ
వారిజాతహితప్రభాపరివాదికౌస్తుభమణివిభూషణ
నారదాతివసిష్ఠసనకసనన్దనాదిమునిపోషణ
ఘోరనక్రనిరుద్ధసంశ్రిత కుఞ్జరేన్ద్రవిపన్నివారణ
సారకరుణాపాఙ్గవీక్షణ సమ్యగాదృతసిద్ధచారణ
సురమునీన్ద్రజనైక కారణ శుభకరాఞ్చితపదసరోరుహ
పరమభాగవతాలయాజిరభాసమాననిలిమ్పభూరుహ
బహుతరోద్భవసఞ్చితాఖిల పాతకామ్బుధరప్రభఞ్జన
మహితభక్తివిశేషభూషిత మౌనిమానసకఞ్జరఞ్జన
నిజపిచణ్డవిమణ్డితామిత నీరజాతభవాణ్డమణ్డల
త్రిజగదభినుత దివ్యమణిగణ దీధితిస్ఫుటమకరకుణ్డల
శతసహస్రార్బుదమనోభవ సదృశనిర్మలరూపభానుర
ప్రతిపదాతికృపానిరీక్షణ పాలితాశ్రితహితమహీసుర
చటులకటితటరాజమానవిశాలచామీకరనిచోళక
కుటిలదైత్యవరూధినీపర ఘోరనిర్భరమదవిభాళక
శరశరద్ఘనహారహీరతుషారచారుయశోవిరాజిత
గరుడకిన్నరయక్షగుహ్యకఖచరవిద్యాధరసుపూజిత
దరసుదర్శనశార్ఙ్గ ఖడ్గగదానమన్వితశయకుశేశయ
చరణసేవకరక్షణాధిక సమ్మదావృతనిర్మలాశయ
వరద నారాయణ చతుర్భుజ వాసుదేవ హరే జనార్దన
పరమపురుష పరేశ కేశవ పద్మనాభ రిపుప్రమర్దన
మధునిషూదన కృష్ణ కైటభమథన విష్ణో గరుడకేతన
విధిమనోభవజనక భవహర వేదవేద్య జగత్సనాతన
తరణిహిమకరనయన దోరన్తరనిరన్తరవిలసదిన్దిర
పరమపావన విశ్వమయ మాం పాహి శ్రీవైకుణ్ఠమన్దిర. ॥65॥

సీ. దీనబాంధవ కృపాబ్ధీ భక్తవత్సల, రవికోటిధామ పురాణపురుష
క్షీరాబ్ధిశయన లక్ష్మీమనోవల్లభ, వైకుంఠనాయక వాసుదేవ
నిగమాంతసంవేద్య నిర్మలానంతక, ళ్యాణగుణార్ణవ యాదిదేవ
జగదుద్భవస్థితిసంహారకారణ, భూత భావన మహాద్భుతచరిత్ర
తే. పుండరీకాక్ష నీగుణంబులు గణింప, నజసహస్రాక్షులకు నైన నలవి గాదు
బాలిశుఁడ నైన నేను నిన్ బ్రస్తుతింప, నెంతవాఁడను మునిజనస్వాంతభవన. ॥66॥

తే. వారిజాతాక్ష యిపుడు భవత్కటాక్షవీక్షణంబున నఘములు వీడఁ బాఱె
క్షుత్పిపాసలు దీఱె నీశుభదమృదుల, వాక్సుధారసపానంబు వలన నీశ. ॥67॥

క. నిను స్మరియించినఁ దలఁచినఁ, గనుఁగొన్నను వందనములు గావించిన న
ర్చన లొనఁగిన సజ్జనులకు, ఘనదురితము లెల్లఁ బాయుఁ గద జగదీశా. ॥68॥

క. వనజభవ భవ సురేంద్రులు, సనకాదినమస్తయోగిజనులును వేదాం
తనిగూఢార్థజ్ఞానులుఁ, గనలేనిత్వాదంఘ్రియుగము గంటి నధీశా. ॥69॥

తే. అహహ జగముల నాభాగ్యమహిమ యెన్న, నరిది యిఁక నింతకంటె నేమైనఁగోర్కి
గలదె భవదంఘ్రియుగభక్తి గలుగ నిమ్ము, చిరతరానంద గోవింద శ్రీముకుంద. ||70||

శేషుఁడు తనవృత్తాంతమును విష్ణువునకుఁ దెల్పుట

తే. అయిన నెఱిఁగింతు నిపుడు మీయాజ్ఞవలన, నేఁదపము సేయు కార్యంబు నిక్కువముగ
ననఘ కశ్యపుఁ డనెడుమహర్షివరుని, తనయుఁడ ననంతుఁ డనుపేరఁ దనరువాఁడ. ||71||

క. భ్రాతలు వేవురు నాకు, మాతృక కద్రూవధూటి మ మ్మొకపనికై
యాతతదహనజ్వాలల, చేతం బడుఁ డంచు నలిగి సెపియించుటయున్. ||72||

తే. అందుఁ దక్షకుఁ డనియెడు నహివిభుండు, శాపభయవర్జితుం డయి జగతిఁ బ్రబలె
నేను నీపాదసరసిజధ్యానరూఢి, నిట్లు తప మాచరించెద నీశ్వరేశ. ||73||

తే. భక్తవత్సల నే నినుఁ బాసి యింక, నొక్కతావున వసియింప నుత్సహింప
నీపదాంబుజయుగళసేవాపరత్వ, మూని యేప్రొద్దు నెమ్మది నుండువాఁడ. ||74||

మ. నలినాక్షాయ నమోఽస్తుతే భగవతే నానాజగద్రూపిణే
ఖలహృద్దర్పతమస్సహస్రఘృణయే కైవల్యనాథాయ ని
ర్మలకారుణ్యగుణాయ ధాతృగురవే మన్దాకినీనామశై
వలినీప్రోద్భవకారణాయ యనుచున్ వాక్రుచ్చి కేల్మోడ్చినన్. ||75||

విష్ణువు శేషునియెడ నిజానుగ్రహము చూపుట

ఆ. హరి యహీనకరుణ నయ్యహీనకులేంద్రు, గారవించి యింపు గదురఁ బలికె
వత్స నీకు భీతి వల దింక నాయొద్దఁ, దలఁగ కెపుడు నెలమిఁ దవిలియుండు. ||76||

క. భక్తపరాధీనుఁడ నే, భక్తుల నెడఁబాసి యొక్కపట్టున క్షణమున్
శక్తుఁడఁ గాను వసింపఁగ, భక్తాధీనంబు నాదు బ్రదుకు కుమారా. ||77||

క. భుజగకులనాథ నీకున్, నిజభక్తిపరుండ వీవు నేఁ డాదిగ నిన్
సుజనహితు విడుచుటకు న, క్కజముగ నెమ్మనమునందుఁ గాంక్షింపఁజుమీ. ||78||

క. తలిమంబ వగుము నా క, గ్గలము సుఖావహము గాఁగ గణుతింపఁగ న
వ్వల నింతకన్న మఱి కాఁ, గలుగు ప్రయోజనము లేదు గద యురగేంద్రా. ||79||

ఆ. శైత్యసౌకుమార్యసౌగంధ్యముల నాకు, శయ్య వగుచు నీవు నెయ్య మమర
నధివసింప మిగుల నర్హుఁడ వగుదువు, భువనవిదితతేజ భుజగరాజ. ||80||

తే. అక్కజంబుగ నీపేర నిక్కొలంకు, భూతలంబున విఖ్యాతిఁబొందఁగల ద
నంతకాసారసంజ్ఞ ననారతంబు, సకలదోషాపహరణప్రశస్తిఁ గాంచి. ||81||

తే. అఖిలకలుషప్రపూరితుఁ డైనమనుజుఁ, డీతటాకంబులో గ్రుంకెనేని యం ద
నంతఫలభాజనం బయి సంతసమున, దివ్యకైవల్యపట్టణస్థితిఁ జెలంగు. ||82||

క. సర్పత్వము నీ కెపుడుఁ బ్ర, సర్పితమైయున్నకతన సమధికలీలన్
సర్పపురాహ్వయమునఁ దగ, నేర్పడఁగాఁగలదు సువ్వె యాక్షేత్ర మిలన్. ||83||

క. పేరెన్నికగా నిం దొక, కారణమునఁ బొడమి నిలువఁగలవాఁడఁ జుమీ
నారదుఁ డనుమునివరున క, పారకృపారససమృద్ధిఁ బ్రత్యక్షం బై. ||84||

వ. అని నిఖిలగుణాశ్రయుండును భక్తపరతంత్రుండును భగవంతుండును నగుశ్రీహరి మృదు
మధురగంభీరోదారవచనంబుల భుజంగపుంగవు నారాధించి యంతర్ధానంబు నొందెఁ

బ్రతిదినంబు నీయుపాఖ్యానం బాకర్ణించుజనుండు జన్మబంధంబులం బాయునని చెప్పిన విని శౌనకుం డగస్త్యునకు వెండియు నిట్లనియె. ||85||

సర్పపురమందలివిష్ణుప్రతిష్ఠనుగుఱించి యగస్త్యుని శౌనకుం డడుగుట

ఆ. యతికులేంద్రచంద్ర యద్భుతంబుగ నీక, థాప్రసంగ మిపుడు దవిలి వింటిఁ
గాని మదికిఁ దృప్తి గలుగకున్నది యింక, వినఁగవలయుఁ దెలుపు విస్తరముగ. ||86||

తే. కలశజన్మ యొకానొకకారణమున, నిచట వసియింతు నని భుజగేంద్రుఁ బలికె
నాదిపూరుషుఁ డైనట్టి హరి యటంచు, నాడితిరిగద మీ రిపు డద్భుతముగ. ||87||

క. ఆకారణ మెట్టిది భువ, నైకధురంధరుఁడు విష్ణు వీశుఁడు ధరణిన్
దాకొని నారదమునిచే, నేకరణిఁ బ్రతిష్ఠఁ బొందె నెఱిఁగింపు దయన్. ||88||

నారదుండు బ్రహ్మసభ కరుగుటనుగుఱించి యగస్త్యుండు దెల్పుట

సీ. అనిన శౌనకున కి ట్లనియె నగస్త్యుండు, సంయమీశ్వర ఫణిస్వామితోడ
భగవంతుఁ డాడినపలుకు తథ్యంబుగ శోభనలీల నచ్చోటఁ బుడమి
నారదమునిచే జనార్దనుఁ డెలమిఁ బ్ర, తిష్ఠితుఁ డై యుండె దివిజు లెన్న
నత్తెఱఁ గెఱిఁగింతు నవధరింపుము సమా, హితమనస్కుఁడ వయి వితతభక్తి
తే. సకలభువనంబులం దెల్ల సంతతంబు, సంచరించుచు నుండును జ్ఞాననిధియుఁ
బరమభాగవతాచారనిరతుఁ డైన, నారదర్షివరుం డొక్కనాఁడు వేడ్క. ||89||

సీ. కాషాయవసనరంగత్కటీరముతోడ, రమ్యమృదూర్ధ్వపుండ్రంబుతోడఁ
బద్మాక్షమాలికాప్రతతవక్షముతోడ, నకుటిలదండకుండికలతోడఁ
గనకవిపంచికాకలితహస్తముతోడఁ, బటుతరారుణజటాపటలితోడ
శరదిందుచంద్రికాసదృశగాత్రముతోడ, డంబారుకృష్ణాజినంబుతోడ
తే. మాధవానంత గోవింద మధునిషూద, నాచ్యుతజనార్దనోపేంద్ర హరిశయాన
యనెడుస్మృతివాక్యములతోడ నద్భుతముగఁ, దండ్రిదర్శించుకోరికఁ దరలి చనియె ||90||

వ. అయ్యవసరంబున. ||91||

సీ. బలరిపుప్రముఖదిక్పాలకు లొకవంక, నొకవంక సనకాదియోగివరులు
గరుడకిన్నరయక్షగంధర్వు లొకవంక, నొకవంక సిద్ధగుహ్యకకులేంద్రు
లర్కచంద్రాదిగ్రహాధీశు లొకవంక, నొకవంకఁ గద్రూభవోత్తములును
ఖచరవిద్యాధరగ్రామణు లొకవంక, నొకవంక వసురుద్రహుతవహులును
తే. గొలువ శతకోటిమార్తాండవిలసదమల, మణిగణస్థాపితాస్థానమండపమున
రత్నపీఠాగ్రమున నురుప్రాభవమున, హాళిఁ గొలువుండె సరసీరుహాసనుండు. ||92||

వ. అట్లు గొలువున్న యన్నిలింపజ్యేష్ఠుం బొడగాంచి నమస్కరించి నారదుండు తదాజ్ఞా ప్రకారంబున నర్హాసనమునం గూర్చుండి యిట్లని వినుతించె. ||93||

సీ. జయ పితామహ సర్వజగదుద్భవనిధాన, జయ చతుర్ముఖ యోగిజనశరణ్య
జయ వాగ్వధూవర సకలలోకేశ్వర, జయ హంసవాహన జలజగర్భ
జయ శతానంద నిశ్చలగుణాలంకార, జయ సురజ్యేష్ఠ సుజ్ఞానగమ్య
జయ విరించన వేదశాస్త్రప్రపంచజ్ఞ, జయ సరోజాసన సాధువంద్య
తే. జయ పురందరముఖసుధాశనవితాన, భర్మకోటీరనిఘటితపద్మరాగ
మణిమయూఖావళీరాజమాననూత్న, దివ్యతరపాదరాజీవ దేవదేవ. ||94||

వ. అని నుతించుచున్నసమయంబునం జతుర్ముఖుండు చతుర్వక్త్రంబులఁ బరమాద్భుతంబు లైనవృత్తాంతంబులు సభాజనంబు లానందింపం జెప్పుచుండి యంతఁ బ్రసంగవశంబున లక్ష్మీమనోనాథుం డైనవిష్ణుననంతవైభవంబు సమధికగంభీరనాదంబున నిట్లని చెప్పఁ దొడంగె. ॥95॥

నారాయణునియుత్కృష్టత్వమును బ్రహ్మ వర్ణించుట

తే. స్రష్టయును సృజ్యుఁడును దానె జగములందు, రక్షకుఁడు రక్ష్యుఁడును దానె ప్రత్యహంబు
హర్తృసంహార్యులును దానె యతికృపాప, రాయణుం డైనయాదినారాయణుండు. ॥96॥

తే. అజుఁ డతండె జనార్దనుఁ డతఁడె శంభుఁ, డతఁడె పురుహూతుఁ డతఁడె చంద్రార్కు లతఁడె
వహ్ని యాతండె సకలదేవతలు నతఁడె, విశ్వ మంతయు నాతండె వేఱులేదు. ॥97॥

క. నేనును బురుహూతుఁడు నీ, శానుఁడు నిఖిలామరులును సనకాదిమహా
మౌనులును విష్ణుమాయా, నూనావర్తమున మునుఁగుచుండుదుముగదా. ॥98॥

వ. మఱియు దేహప్రాణంబులు భిన్నంబు లయ్యు నేకప్రకారంబునం గనుపట్టు దేహంబులు జడంబులు ననిత్యంబులు నవిశుద్ధంబులు నతివికారంబులు నై పంచభూతంబులచేత సంవర్ధితంబు లగుచు నంతంబున వానియందె విలయంబును జెందు విరుద్ధధర్మసంక్ర మణంబునఁ దాదాత్మ్యవర్ణనంబునం దనర్థంబు లై యుండుఁ బ్రాణంబులు చిదానం దాత్మకంబులు నిత్యంబులు శుద్ధంబులు నిర్వికారంబులుఁ బరమాత్మైకధారకంబులు నై యుండు దేహప్రాణంబులకు సంసర్గంబు గావించి భగవంతుం డైన నారాయణుండు తాదాత్మ్యబుద్ధిం బుట్టించుఁ దద్దేహుల కన్నాదులు ధారకంబులు స్రక్చందనాదులు భోగ్యంబు లై యుండు. ॥99॥

తే. అంబుజాతభవాండమధ్యస్థు లగుచ, తుర్విధప్రాణులును దెల్వి దొఱఁగి మదన
జనకమాయామహావర్తమున మునింగి, వెడల శక్తులు గాకుండ్రు వేయునేల. ॥100॥

వ. ఆబ్రహ్మస్తంబపర్యంతంబు స్థావరజంగమాత్మకం బగుసకలజగంబుఁ బ్రకృతినిష్ఠితం బై యుండుఁ బ్రకృతి లోకంబునకుం గారణంబు బలవత్తరంబుగ మాయాగుణత్రయాను బద్ధులును గామమోహితులును నై సమస్తప్రాణులు నుత్కృష్టధర్మం బగుజ్ఞానవైరాగ్య లక్షణం బెఱుఁగనేరక చెడుదురు జ్ఞానబుద్ధు లగుసమస్తయోగులు నణిమాదినిహతు లగుదురు బ్రహ్మనైష్ఠికు లగుయతు లహంకారావృతు లై చెడుదురు వేదశాస్త్రాధికారు లగుద్విజులు విద్యాగర్వప్రతిగ్రహదోషంబుల నశింతురు మఱియుం గరితురగాందోళి కాంబరాభరణమణిరమణీప్రముఖమహైశ్వర్యగర్వంబున నుర్వీపతులును బరాహిత క్రియావిధానంబుల మంత్రవాదులును శాపరూపకోపాటోపంబున బ్రహ్మర్షులును నక్ర త్యపరిగ్రహంబున సోమయాజులును లోభంబున ధనికులును యాచ్ఞాదికంబుల దరిద్రు లును నీశ్వరార్పితబుద్ధిరహితయాగాదిదానంబులఁ గుదాతలును బరవధూప్రతిగ్రహాది వివిధదోషంబుల సమస్తజనులును నధర్మాచారనిరతు లగుచు వర్తించి నశించి స్వర్గయ ..లయాదిలోకంబులం బ్రవేశించి తత్తత్పుణ్యాపాపఫలంబు లనుభవించి క్రమ్మఱ నవనిం బ్రవేశించి కృమికీటకమృగఖగాదికపాపయోనులం ప్రభవించి మరల నశించి పునఃపునర్జననమరణాదిదుఃఖంబులఁ గృశించుచుండుదురు జననమరణంబులకు నంతంబు లేకుండు నట్లుగాక. ॥101॥

ఆ. శివునిమీఁదనైన క్షీరాబ్ధికన్యకా, ధవునిమీఁదనైనఁ దలఁపు నిలిపి
నతినుతిప్రపూజనముల సంతసిలంగఁ, జేయుఘనుఁడు ప్రకృతిఁ జెందకుండు. ॥102॥

క. గోవిందకీర్తనము గౌ, రీవల్లభపూజనంబు దృఢతరభక్తిం
గావించుమనుజుఁ డొందుం, గేవలనిర్వాణపద మకిల్బిషుఁ డగుచున్. ॥103॥

వ. అని యిట్లు సరోజాసనుండు పలుకుచున్న విని నారదుండు దండ్రి కిట్లనియె. ॥104॥

నారదుండు గర్వోక్తులాడి బ్రహ్మచే శపింపఁబడుట

సీ. అభవ నీమాట తథ్యము ముజ్జగములఁ బా, యక వర్తమానచరాచరంబు
లగుప్రాణు లఖిలంబు ననిశంబు విష్ణుమా, యామహావర్తంబునందు మునుఁగు
చుండు నే నప్పురుషోత్తముమాయను, దవులక యుండితి నవిరతంబు
నని నామదిని సంశయం బొకయింతయుఁ, గలుగక వర్తింతు నెలమి మీఱ
తే. ననుచు గర్వసమన్వితం బైనమాట, నారదుం డాడుటయు శతానందుసభను
గలుగువా రందఱును నెమ్మొగములు వాంచి, యూరకుండిరి మాటాడ కోర్మి మెఱయ. ||105||

వ. అప్పు డజుండు విహ్వలమానసుం డగుచు నారదున కిట్లనియె. ||106||

తే. నారదమునీంద్ర నీవంటివార లిట్టి, మాట పలుకంగఁదగదు విస్మయము మీఱ
నన్య మేటికి భావమాలిన్య మిదియె, కాఁగలదుసుమ్ము నీకు నిక్కంబు గాఁగ. ||107||

వ. అని పితామహుండు నారదుం బలికి నిజావాసమందిరంబునకుం జనియె సమస్తదేవర్షి
వరులును యథాస్థానంబులకుం జనిరి నారదుండును యథాపూర్వకంబుగా లోక
సంచారతత్పరుం డై తిరుగుచుండె నని శౌనకున కగస్త్యుం డెఱిఁగించిన నతం డతని
నవ్వలికథావిధానం బెట్లని యడుగుటయును. ||108||

చ. సరసగుణాలయా ప్రణతసామజరాట్పరిపాలనప్రియా
చిరకరుణామయా పతగశేఖరదివ్యహయా లసన్నయా
పరిహృతఘోరకల్మషవిపత్ప్రచయా వినివారితామయా
హరిహయముఖ్యనిర్జరగుణార్చితపాదసరోరుహద్వయా. ||109||

క. అంభోధికన్యకాకుచ,
కుంభద్వయగంధసారకుంకుమపంకా
దంభామోదామోదిత,
శుంభద్దోరంతరాళ శుభగుణశీలా. ||110||

సుగంధివృత్తము. కాశ హార కాశహార కౌముదీ పయ స్సుధా
కాశనిమ్న గేందు తారకా శతార తారనీ
కాశకీర్తిసంప్రకాశ కామితార్థదాయకా
కేశవాచ్యుతాప్రమేయ కృష్ణ లోకనాయకా. ||111||

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితాసామ్రాజ్య
ధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచిగంగనామాత్య
పుత్త్ర సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ
తిమ్మకవిసార్వభౌమప్రణీతం బైనసర్పపురక్షేత్ర
మాహాత్మ్యం బనుపుణ్యచరిత్రంబునందుఁ
బ్రథమాశ్వాసము.

శ్రీశారదామ్బాయై నమః

సర్పపురమాహాత్మ్యము

ద్వితీయాశ్వాసము

లలనాభూలలనా
నీళా మహిళాసనాథ నిరుపమమేధా
లీలాకటాక్షవీక్షణ
పాలితనతయూధ సర్పపత్తననాథా. ॥1॥

తే. అవధరింపు మగస్త్యసంయమివరుండు, శౌనకున కిట్లనియె నట్లు సకలదేశ
ములఁ జరించుచు నారదమునివరేణ్యుఁ, డురుతరామోదహృదయుఁ డై
యొక్కనాఁడు. ॥2॥

నారదుండు సర్పపురము చేరుట

చ. చని చని కాంచె సిద్ధసురచారణయక్షభుజంగకన్యకా
జనకుచకుంభసంభృతవిశంకటసంకుమదైణనాభిచం
దనఘనసారసౌరభనితాంతసుగంధిసరోభిరామమున్
ధనకనకప్రకీర్ణమణిధామము సర్పపురీలలామమున్. ॥3॥

సీ. వేదవేదాంతప్రవీణవిప్రకులంబు, పరశుభాగవతవిభ్రాజితంబు
దీపితనవరత్నగోపురప్రకరంబు, సరసపుణ్యాంగనాసంవృతంబు
పల్లవఫలపుష్పబంధురోద్యానంబు, పావనానంతసరోవరంబు
దివ్యదేవాగారదేదీప్యమానంబు, భర్మనిర్మితహర్మ్యభాసురంబు
తే. భూరిగారుత్మతద్వారతోరణంబు, గురుతరానర్ఘ్యమాణిక్యకుట్టిమంబు
లాలితోదగ్రహరినీలజాలకంబు, పుణ్యనిలయంబు శ్రీసర్పపురవరంబు. ॥4॥

వ. అప్పట్టణంబు ప్రవేశించి యం దొకరాత్రి వసియించి మఱునాఁడు ప్రభాతసమ
యంబున లేచి. ॥5॥

నారదుం డొకకొలనియందు మునింగి స్త్రీయగుట

క. బృందారకముని సంధ్యా, వందన మొనరింపఁ గోరి వరజలములకై
యందందు వెదకుచుండెన్, మందానందమున నంత మహిమ దలిర్పన్. ॥6॥

తే. అతనిగర్వం బడంగింప నాత్మఁ దలఁచి, యచట నద్భుతచేష్టితుం డైనహరి మ
నోహరంబుగ నొక్క పెన్గొలను సరగఁ, గల్పితము చేసె నాశ్చర్యకరము గాఁగ. ॥7॥

వ. అది యమందపిచుమందమందారకుందచందనపాలరసాలహింతాలతమాలమాలతీ
పనసఘనసారకదళీకదంబజంబుజంబీరపున్నాగనాగరంగాశ్వత్థామలకప్రము
ఖానేకానోకహాకీర్ణతటతలవనాంతరాళసమర్థవిపులఫలకిసలయాహారలీలా
విహరమాణహారీహారీతకీరశారిపారావృతపరభృతప్రభృతివివిధగరుద్రథరాజరాజి
కూజితభాజితంబును, మందానిలసముద్ధూతవీచికాబిందుసందోహసమాకీర్ణం

బును, బ్రఫుల్లహల్లకేందీవరకుముదకువలయవిమలకమలాస్తోకమరందపానానంది తేందిందిరబృందమందమధురఝుంకారనినాదమేదురంబును, హంసకారండవక్రౌంచ బకచక్రవాకాదికోజ్జ్వలవిహంగరాజివిరాజితంబును, బ్రాసూనరేణుసంపర్కారు ణాంభఃపూరసుశీతలంబును, నిరంతరదివ్యసుగంధబంధురంబును, మత్స్యకచ్ఛపశిలీ ఢులీకుళీరముఖాశేషాంభశ్చరకులసంకులంబును, బాంథలోకశ్రమాపనోదకవిమలో దకపూరితంబును, సకలజనమనోహరంబును నగునక్కాసారంబు గనుంగొని నార దుం డత్యంతాద్భుతస్వాంతుం డగుచుఁ దత్తీరంబున వీణాకమండలువులు పెట్టి జలా వగాహనార్థం బక్కోలంకు సొచ్చి మునుంగుచుం దేలుచుఁ గొంతతడవు విహరించి యంత. ||8||

సీ. కొదమతుమ్మెదదిమ్ము నదలించుపెన్నెఱుల్, కెందమ్మివిరుల నేల్ కేలుగవయు
జక్కవకవ నుల్లసములాడుచనుగుబ్బ, లలఁతిచీమలబారుఁ గలఁచునారుఁ
బున్నమరేఱేని నెన్నుముద్దుమొగంబుఁ, బగడాల నళికించు తొగరుమోవి
కలువఱేకులసౌరు గెలుచువాల్గన్నులుఁ, బొన్నక్రొన్ననఁ గేరు పొక్కిలియును
తే. జికిలిక్రొమ్మించుటద్దంబుఁ జిన్నవుచ్చు, తళుకుఁజెక్కులు మొల్లమొగ్గలహారంగుఁ
దెగడు పలుచాల్పుఁ దిన్నెల నగుపిఱుఁదులుఁ, గలిగి యబ్రంపునెఱరాచకలికి యయ్యె. ||9||

తే. ఏమి సెప్పుదు నహహా లక్ష్మీశుమహిమ, యెఱిఁగి వాక్రువ్వ జగముల నెవ్వఁ డోపు
నబ్రముగ నారదున కప్పు డాఁడురూపు, వచ్చె నద్దేవవిభుప్రభావంబువలన. ||10||

తే. తనదుపూర్వప్రకారమంతయును మఱచి, తనకు స్త్రీరూప మెపుడు కల్గె నదె కాఁగఁ
దలఁచుకొని యంతఁ దత్సరస్తటముఁ జేరఁ, బదియునాఱేండ్లలేముద్దుఁబడఁతి యగుచు. ||11||

నారదుఁడు స్త్రీయై సుదతి నాఁబరఁగి తనకు భర్తను వెదకికొనుట

తే. దైవవశమున నట్లయి తమి దలిర్ప, సుదతి యనుపేరు గల్గి యా సుదతి దనకుఁ
దగినపురుషునిఁ జక్కనిసొగసుకాని, వెదకికొనుచు నదభ్రసమ్మదముతోడ. ||12||

సీ. కరకంకణంబులు గల్లుగల్లని మ్రోయఁ, బదముల నందియల్ రొద యొనర్పఁ
గాంచికాఘంటికాఘణఘణధ్వను లొప్ప, ముత్యాలచేర్చుక్క మొగి నటింపఁ
దాటంకమణిరుచుల్ తళుకుఁజెక్కులఁ బర్వఁ, గ్రొమ్ముడి వీఁపున గునిసియాడఁ
గులుకుగుబ్బలు పైఁట నెలసి పింపిసలాడ, నలఁతిచెమ్మట మేన నంకురింప
తే. హారకేయూరకటకరత్నాంగుళీయ, కారవమ్ములు తద్దయు హరువు చూపఁ
గడిఁదికలపంబు నెత్తావి గ్రమ్ముకొనఁగ, వనిఁ జరించుచునుండె నవ్వనజవదన. ||13||

తే. మేఘమధ్యంబునందుఁ గ్రొమ్మెఱుఁగువోలె, నింపురాణింప నటఁ జరియించుచుండె
నవ్విధమున నవ్వనజాయతాక్షి, మెలఁగుచో వేళ యొకకొంత మించుచుండె. ||14||

నికుండరాజచరిత్రము

తే. అంత సోమాన్వయోద్భవుం డైనవీర, బాహుపౌత్త్రుండు శ్రుతకీర్తి బాహుజాగ్ర
గణ్యుపుత్త్రుండు నిస్తులపుణ్యఖని ని, కుండుఁ డనియెడునరపాలకుంజరుండు. ||15||

ఉ. భానుఁ డుదగ్రతేజమున భావభవుండు విలాసలీల వై
శ్వానరుఁ డుగ్రరోషమున వాసవుఁ డాతతకీర్తిచే మహా
సేనుఁ డదభ్రవీర్యమున శేషుఁడు వాగ్విభవంబునన్ రమా
జాని కృపాగుణంబున రసాస్థలి నిస్తులశాంతివైఖరిన్. ||16||

సి. తనవినిర్మలమనోవనరుహంబునకు శ్రీ, రమణివిభుఁడు మనువ్రతము గాఁగఁ
దనమండలాగ్రప్రతాపానలంబున, కరిరాజతతి తృణోత్కరము గాఁగఁ
దనకీర్తినర్తకీతరుణీలలామకు, బ్రహ్మాండములు రంగభవనములుగఁ
దనదానవిఖ్యాతఘనఘనాఘనమున, కఖిలార్థులును జాతకావళులుగ
తే. నలరె రఘువర భృగువర నల దిలీప, సగర పురుకుత్స శిబి హరిశ్చంద్ర నహుష
భరత శశిబిందు నిభశుభప్రాభవుండు, నయవిదుండు నికుండభూనాయకుండు. ||17||

తే. అమ్మహీపతిమణి తండ్రి యట్ల ప్రజలఁ, బ్రోదిసేయుచు నక్షత్రభోగలీలఁ
బీఠికాపట్టణంబు సంప్రీతితోడ, నేపు దైవాఱ నెమ్మది నేలుచుండె. ||18||

సీ. దేవదేవుండు కుంతీమాధవస్వామి, దలఁగ కేపురమున నిలిచియుండె
దివిజనాయక సంప్రతిష్ఠితుం డై కుక్కు, టేశ్వరుఁ డేవీట నిరవుకొనియెఁ
బృథుతరాష్టాదశపీఠంబులకుఁ బెద్ద, పురుహూతికాంబ యేప్రోల వెలసెఁ
బరమపావన మైన పాదగయాక్షేత్ర, మేరాజధానియం దేపు మీఱె
తే. సేతుకాశీప్రయాగాద్యశేషదివ్య, తీర్థరాజంబులట్ల ప్రతిష్ఠఁ గాంచె
నేమహాపట్టణం బది యెన్న నలరు, భువనసారంబు పీఠికాపురవరంబు. ||19||

సీ. వివిధశాస్త్రపురాణవేదవేదాంతసం, విదులయి వెలసిన విప్రవరులు
హయమతంగజశతాంగారోహణక్రియా, ప్రౌఢి గాంచిన మేటిబాహుజులును
ధనధాన్యవిస్ఫూర్తి దానవిద్యాభ్యాస, పారీణులైనట్టి యూరుజులును
బాఁడిపంటలచేత భాగ్యసంపన్నులై, సుస్థితి నలరొందు శూద్రజనులు
తే. మఱియుఁ గొదలేనికలుములఁ గొఱలీ వఱలు, నితరవర్ణజనంబులు నతితరముగఁ
గలిగి యేప్రొద్దు శుభలీలఁ జెలఁగుచుండు, భూరివిభవంబు పీఠికాపురవరంబు. ||20||

క. ఆనగరి కధీశ్వరుఁడై, పూనిక నిష్టోపభోగములఁ దనియుచు ధా
త్రీనాథమణి నికుండుం, డానగరిపుకరణి ఠీవి నలరుచు నుండెన్. ||21||

శరద్వర్ణనము

శా. అంతన్ భ్రాంతసరస్సమగ్రబిసనాళాహారలీలాపరి
భ్రాంతానంతమరాళికానిచయసుశ్రావ్యస్వనాకర్ణనా
శ్రాంతాత్యంతకుతూహలోల్లసితభాస్వచ్ఛాలిపాలీజన
స్వాంతం బై శరదాగమంబు దనరెన్ సర్వంసహామండలిన్. ||22||

సీ. విమలపయోదఖండములు మింటఁ జరించె, కలమమంజరులెల్లఁ దలలు వంచెఁ
గొలఁకుల నలినముల్ గలువలు వికసించె, మదమరాళంబుల రొదలు మించె
వృషభగుల్ ఱంకెలు వేయుచు నెదిరించె, శైవలినీతతుల్ సన్నగించెఁ
గేకిసంఘాతంబు కేకలు చాలించెఁ, బొనఁగఁ ద్రోవలను రొంపులు నశించె
తే. విలసితంబుగఁ బైరులు విస్తరించె, సాంద్రచంద్రాతపంబు తేజము వహించె
నధిపులకు వెంటఁ దమి మది నంకురించె, జనమతము లైనయాశరద్దినములందు. ||23||

నికుండరాజు సుదతి యున్నవనంబున కరిగి వేఁటాడుట

వ. ఆసమయంబున నొక్కనాఁడు కందర్పసుందరుండును గదనశూరుండును శత్రునిషూద
నుండును జతుర్దశవిద్యాప్రవీణుండును జతురుండును సంతతదానకళాపారీణుండును
సమగ్రలక్ష్మీకుండును సర్వాలంకారభూషితుండును సముదగ్రగంభీరుండును నగునికుండ
నరేంద్రచంద్రుండు మృగయావిహారలంపటస్వాంతుఁ డగుచుఁ దురగఖురపుటాంచ
లోద్ధూతస్ఫీతధరాపరాగం బంబురుహబంధుమండలంబు మాయంబుసేయ పత్త్యశ్వ
రథద్విరదసంఘాతసంఘట్టనంబుల వసుంధరాభాగంబు సంచలింపఁ బరశుగదాప్రాస

తోమరభిందిపాలకరవాలప్రముఖపాధనప్రభాజాలంబులు చూడ్కుల మిఱుమిట్లు గొలుప సముత్తుంగతురంగహేషాఘోషంబులును గజబృంహితధ్వానంబులును శింజినీ టంకారవిరావంబులును రథాంగనిర్భరనినాదంబులును సుద్భటభటపటలకోలాహ లారావంబులును భేరీపటహకాహళనిస్వనంబులును దిగిభకర్ణపుటంబులం జెవుడ్పడం జేయఁ గనకమయాందోళికారూఢుండై తరలి చని తద్వనాంతరంబు ప్రవేశించి యచ్చట. ||24||

క. తమి మీఱఁ బారశీకో, త్తమతురగము నెక్కి హాళి దైవాఱ వడిన్
దుమికించి పరువువైచుచు, సముదంచితలీల మెలఁగు సమయమునందున్. ||25||

ఆ. మృగయు లడవిఁ దూఱి మిగుల గగ్గోలుగా, సొరిదిఁ గూఁత లిడుచుఁ జొచ్చుటయును
మృగకులంబు బెగడి మొగి బయల్వెడలి భూ, కాంతమౌళిచెంతఁ గదియుటయును. ||26||

సీ. పందులఁ జిందఱవందఱగా మోది, దుప్పులఁ బోనీక తునిమివైచి
సారంగముల బీర మారంగ నుగ్గాడి, శశములఁ బనచెడ సమయఁగొట్టి
కడఁతుల నుమ్మడిఁ గడువడిఁ బొరిగొని, యేదులబలితంపుటేపు మాపి
తఱిమి పెల్లునఁ గొండగొఱియలఁ జక్కాడి, మనుఁబోతులను సదమదము సేసి
తే. కన్నెలేళ్లు నెమిళ్లును గారుకోళ్లుఁ, బోలుగలుఁ గౌజు లాదియౌ పులుఁగుగముల
మేటరిగఁ జంపెఁ బరిగొని వేఁటలాడి, చిత్త మిగురొత్త నారాజశేఖరుండు. ||27||

ఉ. కొందఱు లేళ్ల దుప్పులను గొందఱు కొందఱు మన్నుఁబిళ్లులం
గొందఱు భల్లుకంబులను గొందఱు బెబ్బులులన్ సివంగులం
గొందఱు కొండ ఱెళ్లులను గొందఱు పందుల నేదుపందులం
గొంద ఱమందశౌర్యమునఁ గూల్చిరి బంట్లు కడంక మీఱఁగన్. ||28||

క. కుందేళ్లఁ గొండగొఱియలఁ, బందుల దుప్పులను లేడిపదువుల నిర్లం
జిందఱవందఱగ శునీ, బృందంబులు గఱచి చంపెఁ బెల్లడలంగన్. ||29||

క. సేనాధిపు లొకకొందఱు, శ్యేనంబుల విడిచి రాజసింహుఁడు మెచ్చన్
నానావిహగోత్కరముల, సేనగఁ బరిమార్చి యార్చి చెలఁగిరి నెమ్మిన్. ||30||

నికుండరాజు వనిం జనుచు సుదతిం గని వర్ణించుట

సీ. అంతట మృగయావిహారంబుఁ జాలించి, వసుధాతలేంద్రుండు వలనుమీఱఁ
దప్తచామీకరోద్యత్పరిష్కారస, మున్నతమేరుశృంగోపమంబు
వజ్రగోమేధికవైడూర్యమరకత, హరినీలపుష్యరాగాబ్జరాగ
మౌక్తికప్రముఖాచ్ఛమణిగణసమలంకృ, తము నగుఘనతురంగమము డిగ్గి
తే. సూర్యసమతేజులును మహాశూరు లనిల, వేగులును దివ్యభూషణాన్వితులువైన
వీరపురుషులతోఁ గూడి విపినవీథి, నెలమి దైవాఱ నందందు మెలఁగుచుండె. ||31||

సీ. హారీతశుకశారికారవాక్రాంతంబు, పరభృతకూజితభ్రాజితంబు
సరసగానకళానిశభ్రమద్భ్రమరంబు, ప్రమదనృత్యన్మత్తబర్హిణంబు
నికటసరోహంసనిస్వనాకీర్ణంబు, సాంద్రపుష్పపరాగసంకులంబు
ఫలభారకుసుమస్తబకలసద్భూజంబు, మృదులమరందఝరీపరీత
తే. మతితరామోదమేదురాత్యంతశీత, లానిలకిశోరవారసమావృతంబు
నైనయక్కాననంబు భూజాని కపుడు, మోదమును గూర్చె గణితంపుసేదదీర్చి. ||32||

వ. అట్లు సుఖావహం బగునవ్వనంబున విహరించుచుం జని చని యొక్కచోట. ||33||

మ. కనియెన్ భూపకుమారమౌళి యొకరాకాచంద్రబింబాననం
గనకాంగిం గలకంఠకంఠిఁ గలికిం గస్తూరికాసౌరభం

గనదంభోజదళోపమాననయనన్ గంధేభకుంభస్థలిన్
ఘనసారాచ్ఛదరస్మితన్ ఘనకచం గాంతాజనగ్రామణిన్. ||34||

క. కని మెల్లన డాయం జని, వనజాయతనేత్రరూపవైభవములకున్
మనమున నద్భుత మొందుచు, జననాయకమౌళి దానిసొరు నుతించెన్. ||35||

క. అద్దిర దీనియొయారం, బద్దివిజవధూమణులకు నహికులపుజగా
ముద్దియలకు మానినినెఱ, ముద్దులగుమ్మలకుఁ గలదె ముల్లోకములన్. ||36||

చ. బలురతనంపుగోవ యని పల్కినఁ దావులు సిల్కుచుండె ను
న్గళుకుఁబసిండిబొమ్మ యని కాంచినఁ బల్కులు నేర్చి యుండెఁ గ్రొం
దొలకరిమించుఁదీవ యని తోఁచిన నిల్కడ గల్గి యుండె నీ
కలికికడిందిజవ్వనము కన్నులపండువ యయ్యె నద్దిరా. ||37||

సీ. చిన్నారిజాబిల్లి కన్నెమామిడిగున్న, మరునివాల్దూపు చేమంతిబంతి
తళుకుబంగరుబొమ్మ తొలకరికొమ్మించు, కులుకుమిటారి వెన్నెలకొటారు
తెలిముత్తియపుగోవ వెలలేనిమానికం, బలఁతి వెన్నెలనిగ్గు పల్కుఁజిల్క
కపురంపుబరణి చొక్కపునిల్వుటద్దంబు, తావిగేదఁగిపువ్వు తమ్మికొలను
తే. నాఁగ గొనబారునియ్యెల నాఁగబాగు, నాగగంధర్వయక్షకిన్నరనిలింప
గరుడఖచరాప్సరస్సిద్ధకామినులకుఁ, గలదె పరికింప మూఁడులోకములయందు. ||38||

సీ. అలులు లేనెల విండ్లు తిలపుష్ప ముత్సల, దళములు మగఱాలు తమ్మికెంపు
ముకురముల్ శ్రీకారములు దరంబు బిసంబు, లబ్జముల్ జక్కవ లాకసంబు
భుజగంబు తరఁగలు పొన్నపూ వచలంబు, పులినంబు లశ్వత్థదళ మనంటి
కంబముల్ కాహళుల్ కచ్ఛపంబులు తార, కలు పల్లవంబులు కాంచనంబు
తే. కప్పురము గూర్చి సరసిజగర్భుఁ డిట్లు, చేసెఁ గాఁబోలు నిమ్ముద్దుఁజిగురుఁబోఁడి
నట్లు గాకున్న నీభువనైకమోహ, నాద్భుతాకారవైభవం బవలఁ గలదె. ||39||

క. బంగారుబొమ్మతెఱఁగునఁ, బొంగారుచు మదికి నాసఁ బొదలించెడునీ
శృంగారవతివిలాసం, బంగజుపట్టంపురాణికైనం గలదే. ||40||

సీ. కరికుంభములతోడఁ గలహంబు గావించి, మారేటిపండ్లతో మచ్చరించి
క్రొవ్విరిచెండ్లతోఁ గొదుకక వాదించి, పసిఁడికుండలతోడఁ బ్రతిఘటించి
గిరిశృంగములతోడ మరలక యెదిరించి, బలుబొంగరాలతోఁ బంతగించి
గజనిమ్మపండ్లతోఁ గవగొని జగడించి, తమ్మిమొగ్గలతోడఁ దారసించి
తే. ముద్దుజక్కవకవలతో మొగ్గరించి, పొన్నకాయలతోఁ బగల బుండ్రగించి
యతితరం బైనచెలువున నలరె నౌర, యబ్బురంబుగ దీనిచన్నుబ్బదోయి. ||41||

సీ. కనకకుంభము లెంతకాఁకచేఁ బెరిఁగిన, దరము లేతెఱఁగున మొరయుచున్న
గరటికే లెంతవంకరగా మెలంగినఁ, గడుఁజక్కిలము లెంత యుడుకుచున్న
భుజగంబు లేరీతిఁ బొర యూని పొరలిన, మృగకులాధిపుఁ డెంత యెగిరిపడినఁ
గలికితేం ట్లెంతఝుంకారంబు చూపిన, మీ లెంతపొల సెక్కి మిట్టిపడిన
తే. నౌర యిక్కొమ్మకుచకంధరోరుకర్ణ, రోమవల్లీవలగ్నశిరోజనయన
ముల నెదుర్కొని యొక్కింత గెలువఁగలవె, మరునిక్రొంబువ్వుములికి య య్యారిదికలికి. ||42||

వ. అని కొనియాడుచున్నసమయంబున. ||43||

సుదతి నికుండరాజుం గని వలచి వర్ణించుట

క. రాజానన గనుఁగొనియె వి, రాజన్మణిభూషణాభిరామశరీరున్
రాజకుమారున్ జితసుర, రాజకుమారేందురాజ రాజకుమారున్. ||44||

క. వనజాతనయన యటువలెఁ, గనుఁగొని యెనలేనివలపు గడలుకొనఁగ నా
తనిచెలువమునకుఁ దద్దయుఁ, దనమదిలో నద్భుతంబు దనరారంగన్. ||45||

క. కంతుఁడొ మఘవసుతుండొ వ, సంతుఁడొ నలకూబరుండొ జలజాహితుఁడో
సంతస మయ్యె నహో యి, క్కాంతాజనమోహనాంగుఁ గనుఁగొన్నంతన్. ||46||

సీ. దరములఁ దఱుమునిద్దంపుఁగుత్తుకవాఁడు, హరినీలముల నేలు కురులవాఁడు
గజతుండముల మించు భుజదండములవాఁడు, గురుకవాటముఁ బోలు నురమువాఁడు
చిగురుటాకుల నెన్ను తొగరువాతెరవాఁడు, గబ్బిసింగము గెబ్బు కౌనువాఁడు
తమ్మిఱేకులఁ బాఱఁజిమ్ముకన్గవవాఁడు, మినుకుబంగరుఁ గేరు మేనివాఁడు
తే. జాతిమగఱాలఁ దెగడుపల్ చాల్పువాఁడు, చికిలిక్రొమ్మించుటద్దంబుఁ జిన్నవుచ్చు
చెక్కుఁ గలవాడు బళిర యాక్షితివరుం డ, టంచు నాతనిసోయగం బెంచుచుండె. ||47||

క. అపు డానృపతనయునిపైఁ, జపలేక్షణపై మరుండు సమసుమశరముల్
శపథం బూని పొరింబొరి, విపరీతము గాఁగ నేసి వివశులఁ జేసెన్. ||48||

నికుండరాజు సుదతిం దనపురికిఁ గొనిపోవుట

వ. అప్పు డప్పుడమిఱేఁ డచ్చేడియం గనుంగొని యిట్లనియె. ||49||

ఉ. ఎక్కడిదాన వీవు కమలేక్షణ నీవు వసించునున్కిప
ట్టెక్కడ నీమనోరమణుఁ డెవ్వఁడు నీతలిదండ్రు లెవ్వ రీ
చక్కనిజాళువాపసిఁడిచాయలఁ గేరెడు మేను గందఁగా
నొక్కతె విక్కడం దిరుగుచుండఁగఁ గారణ మేమి చెప్పుమా. ||50||

సీ. అనిన నచ్చాన యనంగనారాచసం, తప్తయు నాచ్ఛాదితస్వదేహ
లతికయ నిర్భరలజ్జానిమీలిత, నయనయు నై మహీనాథు సారెఁ
గడగంటిచూపులఁ గనుఁగొంచు నొకతరు, పార్శ్వంబునం దుండి పాదపంబు
కొనగోళ్ల వ్రాయించుకొనుచు నౌదల వాంచి, యొక్కింత మాటాడ కూరకుండె
తే. వీతరాగుండు తత్త్వసంవిదుఁడు నిస్పృ, హుండు నగు నారదుం డప్పు డోలి రాగ
కామలజ్జాధికత్వముల్ గలిగియుండె, నహహ దైవకృతం బెన్న నద్భుతంబు. ||51||

వ. అని యగస్త్యుండు వెండియు శౌనకున కిట్లనియె న ట్లయ్యాగంతుకాంగనారత్నంబు
మదనవిహ్వలమానస యగు టెఱింగి తానును మదనావిష్టుం డై నృపాలుండు దాని
కిట్లనియె. ||52||

తే. వనజముఖి నీవు కన్యక వనుచు మదిని, దోఁచుచున్నది చూడ నద్భుతము నీదు
రూప మిట న న్వరింపు మారూఢవాంఛ, సఫల మగుఁ జుమ్ము నీయెలజవ్వనంబు. ||53||

సీ. కలహంసగామిని కరటికుంభస్తని, కర్పూరదరహాస కంబుకంఠి
కలకంఠకలవాణి కాహళికాజంఘ, కహ్లారదళపాణి కమలవదన
కాసారనిభనాభి కంఠీరవవలగ్న, కనకకోరకనాస కైరవాక్షి
కస్తూరికాగంధి కచ్ఛపచరణాగ్ర, కార్ముకభ్రూవల్లి కాంచనాంగి
తే. కదళికాస్తంభరుచిరోరుకాండయుగళ, కల్పభూజాతనవలతాకలితబాహ
కాలజీమూతనీకాశఘనశిరోజ, కామినీమణి ననుఁ బ్రేమఁ గవయు మిపుడు. ||54||

క. కొమ్మా నెమ్మది నాతోఁ, రమ్మా మాపురికి సకలరాజ్యంబును నీ
సొమ్ముగఁ జేసెద ననుఁ జే, కొమ్మా మరుకేలి నేలుకొమ్మా నెమ్మిన్. ||55||

తే. అనుడు నబ్భూమిపరుమాట లాలకించి, మెత్తఁబా టూని యన్నులమిన్న కన్ను
నన్నుల నలంతినవ్వుల నున్నతెఱుఁగు, వన్నె దైవాఱ నెఱిఁగించి మిన్నకుండె. ||56||

వ. అప్పు డమ్మహితలవల్లభుండు దానికరంబు పట్టుకొని సుఖాసనంబునం గూర్చుండం
జేసి యమందానందకందళితహృదయారవిందుం డగుచు వరూథినీపరివృతుండై దివ్య
తూర్యఘోషంబులు సెలంగ నిజపట్టణంబు ప్రవేశించి. ||57||

నికుండుఁడు సుదతితో నిష్టోపభోగము లనుభవించుట

తే. అంత నంతఃపురంబున కరిగి దివ్య, మందిరంబున నవ్వధూమణిని నిలిపి
యిందుముఖిఁ గూడుకొన నెపు డెప్పు డంచు, నురుతరామోదహృదయుఁడై యుండె నంత.
||58||

సీ. తరణి పశ్చిమసముద్రప్రాంతమునఁ గ్రుంకె, గడితంపుసాంధ్యరాగంబు పర్వెఁ
గటికిచీఁకటులు దిక్తటముల గిఱికొ నెఁ, దార లంబరవీథి దళముకొనియెఁ
గొలఁకులఁ దొగలును గలువలు వికసించె, జలజాతవిసరముల్ దలలు వాంచెఁ
గుముదబంధుఁడు తూర్పుగుబ్బలి నుదయించెఁ, గోకదంపతు లార్తిఁ గూరి పఱచెఁ
తే. జెలఁగి బలితంపుఁబండువెన్నెలలు గాసె, విటవిటీజను లెనలేనివేడ్కతోడఁ
దవిలి విహరింపఁ జాగి రుద్దామలీల, నఖిలజంతుసుఖావహం బయ్యె నపుడు. ||59||

సీ. పవడంపుఁగోళ్లచప్పరపుమంచము హంస, తూలిక నించిన పూలపఱుపు
ప్రక్కద్రిం డ్లలఁతిహొంబట్టుతలాడ మా, నికపుఁగీల్బొమ్మలు నిలువుటద్ద
ములు తావిసురటీలు మొకమాలుచందువా, మేలిముత్యాలజాలీలు పసిఁడి
దివ్వెగంబములు క్రొంజవ్వాజివంకిణీ, లడపంబు గందంపుగుడిక లగరు
తే. కరవటంబులు కస్తురిబరణి తమ్మ, పడగ యత్తరుకుప్పెలు పైఁడిగద్దె
వీటికాపేటికలును బన్నీటిగిండ్లుఁ, కలిగి వెలుఁగొందు కేళికాగారముననను. ||60||

క. కాంతారత్నముతో భూ, కాంతాగ్రేసరుఁడు ప్రేమ గడలుకొనంగాఁ
గంతుక్రీడావైభవ, సంతుష్టస్వాంతుఁ డగుచు నరవిఁ జెలంగెన్. ||61||

వ. మఱియును. ||62||

తే. రత్నశయ్యావితానవిరాజమాన, మందిరంబుల మణికుట్టిమస్థలములఁ
బుష్పవనములఁ బ్రాసాదములఁ గడంక, నువిదయును దాను గ్రీడించుచున్నయంత. ||63||

క. ఆఱేఁడుఁ జెలియుఁ గూరిమి, మీఱఁగ సుఖలీల నట్లు మెలఁగఁగ వరుసన్
నూఱుగురు సుతులు వుట్టిరి, తాఱనిగడితంపుఁగడిమిఁ దనరెడుబలిమిన్. ||64||

సుదతిమగఁడును గొడుకులును యుద్ధములోఁ జచ్చుట

వ. వారందఱు నతితరసత్త్వసంపన్నులు నఖండవీరపరాక్రములు నపరిమితతేజోవిరాజి
తులు నభినవయౌవనారంభులు నశేషశస్త్రవిద్యావిశారదులు నై ప్రవర్తించుచున్న
సమయంబున నొక్కనాఁడు. ||65||

సీ. అపరాబ్ధితీరంబునందు రిపుంజయుఁ, డనురాజు దనరు నన్వర్థనామ
కుఁడు తదాత్మజులు ముగ్గురు పరంతపపరా, స్కందులు పరవిశోషకుఁ డనంగ
వెలయుదు రమ్మహావీరవర్యులు ప్రాక్ప, యోధిజిగీషఁజమూరుగణస
మేతులై వచ్చి సమీపధాత్రీభాగ, మున దండు విడియించి మొనయుటయు ని
తే. కుండనరపతి నిజపుత్త్రకులును దాను, బేర్మిఁ జతురంగబలసముపేతుఁ డగుచుఁ
దరలి మొనకట్టి ఘోరయుద్ధంబు చేసె, నప్పు డుభయబలంబులు ననికిఁ దొడరి. ||66||

క. పరశుగదాపట్టిసము, ద్గరతోమరభిందిపాలకౌక్షేయశర
చ్ఛురికాదిసాధనంబులఁ, గర మరుదుగ భటులు దుమురు గావించి రొగిన్. ||67||

క. పృధుబలసంయుతులు జగ, త్కథితమహాయశులు ఘోరగర్వోద్ధతులుం
బ్రధనజయదర్పితులు నగు, రథికులు పోరాడి రధికరభసం బెసఁగన్. ||68||

తే. చిత్రవైఖరి నిశితకౌక్షేయకములు, పెఱికి జవఘోటకంబులఁ బఱపి బిట్టు
నఱకు లాడిరి రాహుతు లుఱక నిబిడ, రక్తధారాప్రవాహం బురవడిఁ బర్వ. ||69||

క. గిరులును గిరులును దార్కొను, కరణిన్ మదవారణములఁ గదనంబునకుం
బురికొల్పి వేటులాడిరి, కరివాహకు లపు డఖర్వగర్వోద్ధతు లై. ||70||

వ. మఱియుం దురగఖురపుటాంచలోద్ధూతస్ఫీతధరాపరాగరింఛోళిచ్ఛాదితారుణాంశు
మండలం బగునబ్భండనంబు భూరిభేరీపటహనిస్సాణకాహళారవంబువలనను వీరభటో
త్కటసింహనాదంబువలనను నిష్ఠురధనుష్టంకారంబువలనను మదోన్నిద్రభద్రదంతావళ
బృంహితంబువలనను సముత్తుంగతురంగహేషారవంబువలనను నసంఖ్యాశంఖనాదంబు
వలనను నభంగశతాంగనిర్ఘోషంబువలనను గ్రందుకొని రోదోంతరాళంబు బధిరీకృతం
బై యుండె నందు ఘోరంబుగఁ బో రొనరించి కరితురగవీరభటనికాయంబులు
కాయంబులం బాసి పడియున్న సంగరాంగణంబు పుష్పితపలాశారణ్యంబుతెఱంగునం
బొలిచె రక్తధారాప్రవాహంబు లుప్పొంగి యంబునిధికి జాగి పాఱె నప్పుడు. ||71||

తే. రాజు లెదిరించి ఘనసమరాజిరమున, నందఱును మ్రగ్గుటయు నికుండాధిపతియుఁ
దారసిలి బిట్టు ఘోరయుద్ధంబు చేసి, కొడుకుఁగుఱ్ఱలతోఁ గూడి పుడమిఁ గూలె. ||72||

చచ్చినమగనినిగుఱించియుఁ గొడుకులగుఱించియు సుదతి యేడ్చుట

ఉ. అంత నికుండమానవధరాగ్రణిచేడియ తత్ప్రకార మా
ద్యంతము వీనుల న్విని రయంబున నాహవభూమి కెంతయు
న్వంత దలిర్ప నేఁగి కదనస్థలిఁ ద్రెళ్లినప్రాణనాయకున్
బంతిగఁ గూలియున్నసుతవర్గముఁ గన్గొని శోకమగ్న యై. ||73||

క. హానాథ హామనోహర, హానిరుపమధర్మశీల యమితవిభోగా
హానరపాలశిఖామణి, దీనునిక్రియ నిట్లు ద్రెళ్లితే కద నోర్విన్. ||74||

తే. అమలమణిమయభర్మహర్మ్యాంతరమునఁ, దతమృదులహంసతూలికాతల్పమున సు
ఖించునీయొడ లీరణక్షితిని బొరలు, చున్న దిపు డేమి సేయుదుఁ జెన్ను దఱిఁగి. ||75||

వ. అని కుమారవర్గంబు గనుంగొని పయింబడి ముంగురులు సెదరఁ గరంబుల నొదల
మోఁదుకొనుచు నెలుం గెత్తి హాబిడ్డలారా యిట్టిఘోరదురవస్థం బొందితిరే యని
వెక్కి వెక్కి యేడ్చుచుఁ బుడమిం బడి పొరలాడుచు నుస్సురనుచు నుమ్మలించుచు
సొమ్మగొనుచు ధూళిధూసరశరీర యై పెద్దయుందడవు దుఃఖించి బడలి యడలుచు క్షు
త్పిపాసాపరవశ యై యేమియుం దోఁపక వనంబునఁ ద్రిమ్మరుచున్నసమయంబున. ||76||

సుదతి యాఁకలిగొని మామిడిపండు గోయంబూనిన నది యెట్లును నందకుండుట

తే. సౌకుమార్యంబుఁ దేజంబు సౌష్ఠవంబు, సౌరభంబును గల్గి యాశ్చర్యలీల
నలరు నొకచూతఫల మందుఁ గలుగఁజేసె, హరి యదియు నట్టు లాఁకటఁ దిరిగి తిరిగి. ||77||

క. చేరువ నమ్మామిడిపం, డారూఢిగఁ గొమ్మయందు నందినయటులే
తోరముగఁ గానిపించినఁ, గోరికఁ జే సాఁచి యందుఁ గొనఁబోవుటయున్. ||78||

తే. ఫల మొకించుకయెడఁ గనంబడి కరమున, కందకుండిన వే నిక్కి యవ్వధూటి
కోర్కి నప్పుడు వెండియుఁ గోయఁబోవ, నటులె యెడఁ జూపి కేలికి నంద దయ్యె. ||79||

వ. అప్పు డప్పొలఁతి నితాంతజఠరానలసంతప్తసకలావయవ యగుచు సమీపంబునం బడియున్నపుత్త్రకు నొక్కనిం దెచ్చి వైచి యెక్కి యందుకోనం బోయినఁ దత్ఫలం బందక యంతరంబు గలిగియుండె నట్లు క్రమక్రమంబునఁ బుత్త్రశతంబు సోపానపద్ధతిఁ గావించి కోయంబోవుచున్న నది యెప్పటియట్ల యందకున్న నత్యంతదీనానన యై కన్నుల నశ్రుకణంబు లురల నేమియుం దోఁపక చీకాకుపడి ఫలం బెగదిగం జూచుచున్నసమయంబున. ||80||

విష్ణువు వృద్ధవిప్రుఁడై వచ్చి సుదతికి మేలు చేసి యంతర్హితుం డగుట

సీ. చినిఁగిననీర్కావిచిన్నదోవతియును, దట్టంపుఁదెలిజన్నిదములగుంపు
రదనహీనవిశాలవదనగహ్వరమును, రహి మించుదండంబు రాగిచెంబు
దళముగా నరసిన తలయు గడ్డంబును, జెప్పులు దావళి దుప్పటియును
మడతలఁ దేఱుచామనిచాయనెమ్మేను, మందయానము జపమాలికయును
తే. గొనబుమీఁదెడుగోపిచందనమ్మదూర్ధ్వ, పుండ్రమును గల్గి యప్పుడు భూసురోత్త
మాకృతి ధరించి చెచ్చెర నచ్చెరువుగ, వచ్చె నచ్చటి కిందిరావల్లభుండు. ||81||

క. చనుదెంచి యశ్రుముఖియును, ఘనశోకాన్వితయు క్షుద్వికారార్తయు నై
వనిఁ ద్రిమ్మరునమ్మానినిఁ, గని యావృద్ధద్విజుండు కరుణం బలికెన్. ||82||

క. ఏమిటి కేడ్చెద వివ్వన, భూమిం ద్రిమ్మరుచు ముగుద పొలఁతీ మూలం
బేమి యిటు లార్తి నడలఁగ, నీమదిఁ గలవగపుతెఱఁగు నిక్కమ చెపుమా. ||83||

తే. అనుడు సతి పల్కె నీ వెందు నరుగఁగలవొ, పొమ్ము నాతోడ నీ కేల భూసురేంద్ర
యని తిరస్కారముగ వచించిన నతండు, హితవచోరూఢి వెండియు నిట్టు లనియె. ||84||

తే. వనిత యిటు లొక్కతెవు నీవు వనములోన, నలమటించుచుఁ దిరుగుట యరసి చూచి
తెలిసికొనిపోవు టుచితరీతిగఁ దలంచి, వచ్చితి నెఱుంగఁ జెప్పు నీవర్తనంబు. ||85||

సీ. అనవుడు నచ్చాన యతని కిట్లని పల్కె, విను భూసురేంద్ర నా విన్నపంబు
సూర్యోపమానతేజోనిధి యైనని, కుండధాత్రీనాథకుంజరునకు
భార్య నై బహుభోగభాగ్యంబు లారూఢి, ననుభవించుచు మనోజాకృతులును
శస్త్రాస్త్రవిద్యావిశారదు లగునూర్వు, రాత్మజులను గాంచి యతితరప్ర
తే. హర్షమునఁ గ్రాలుచో నిపు డాహవాంగ, ణమున మగఁడును గొడుకులు విమతవరుల
చేత హతు లైనఁ దద్వియోగాతతార్తి, దుఃఖమున నిందుఁ దిరిగెద దొసఁగు లెసఁగ. ||86||

తే. అంతకంటెను ఘనతరం బగుక్షుదార్తిఁ, దివిరి వనియెల్ల నెమకుచుఁ దిరిగితిరిగి
యక్కజంబుగఁ గొమ్మపై నొక్కమావి, పండు గనుఁగొంటిఁ గన్నులపండువుగను. ||87||

క. ఆపండు గోయఁబోయిన, నేపగిదిన్ దొరకకున్న నెడ యొదవనిసం
తాపమున బడలుచుండితిఁ, దాపసవర నాయవస్థ దైవం బెఱుఁగున్. ||88||

వ. అనిన నాద్విజపుంగవుం డంగనామణి కిట్లనియె. ||89||

తే. పతితనూజవియోగార్తి బడలుచుండి, యతితరం బైనక్షుద్బాధ నడలుచుండి
యశుచితో నుండి పండు గోయంగఁ జనిన, నబ్బునే బేల యిత్తెఱఁ గర్థ మగునె. ||90||

తే. సరసి కేతెంచి యందుల స్నాన మాడి, నిర్మలస్వాంత వై యున్న నీకు నపుడె
సకలదుఃఖాపహారి యౌ నత్ఫలంబు, కరతలాగత మగుఁజుమ్ము కమలవదన. ||91||

వ. అనిన నమ్మగువ యిట్లనియె. ॥92॥

క. దీనజనావన కరుణాం, భోనిధి నాతండ్రి నీకుఁ బుత్త్రిని న న్నీ
మాననియాఁకట బడలం, గానీయక వేగ ప్రోది గావింపఁగదే. ॥93॥

తే. అనఘ స్నానంబువలన నయ్యబ్బురంపు, ఫలము చేతికి నెట్లు రాఁ గలదు పుణ్య
సరసి యెచ్చోట నున్నది సరగ నాకుఁ దెలుపవేయని మ్రొక్కి ప్రార్థించుటయును. ॥94॥

ఆ. బ్రాహ్మణుండు పలికెఁ బరమదయాళుఁడై, ముగుద యనతిదూరమున సమగ్ర
నిర్మలోదకముల నెరయుచు నొకకమ, లాకరంబు లీల నలరుచుండు. ॥95॥

తే. కుముదకహ్లారకువలయకోకనదస, రోరుహేందీవరాకీర్ణ మై రణన్మ
దాళిసంకీర్ణమై కౌంచహంసకోక, సంకులంబయి నెఱి నక్కొలంకు దనరు. ॥96॥

సీ. కుంద చందన పిచు మంద వందక పట, మందార తిందుక సిందువార
గాల వాంకోలతక్కోల తమాల హిం, తాల తాల రసాల సాల తూల
కురువక మరువక సరళ క్రకర పుర, కరవీర ఖది రామ్లికా కరీర
నారంగ లికుచ ఖర్జూర జంబీర హ, రీతికీ కేతకీ మాతులుంగ
తే. పనస ఘనసార కదళికా ప్రముఖవివిధ, ఫలకుసుమగుచ్ఛకిసలయభరనమత్స్వ
కృష్ణభూజాతజాతప్రకీర్ణ మగుచు, వఱలుఁ దత్తీరమున నొక్కవనము తరుణి. ॥97॥

మ. సరసీనిర్మలనీరబిందుకణముల్ సమ్యగ్గతిం బూని వి
స్ఫురదారామలతాంతసౌరభరజఃపుంజంబుఁ గైకొంచు ని
ర్భరమందానిలశాబకప్రకరముల్ పల్మాఱు నక్కోనలోఁ
దిరుగుం బాంథజనశ్రమాసహరణోద్వృత్తిం బ్రకాశించుచున్. ॥98॥

తే. తరుణి నీ వచ్చటికి నేఁగి తత్తటాక, నీరముల స్నాన మొనరింప నీకు ఫలము
చేతి కబ్బును బొ మ్మంచుఁ బ్రీతిఁ జెప్పి, యంత నంతర్హి తుం డయ్యె నాద్విజుండు. ॥99॥

వ. అని కుంభసంభవుండు శౌనకమునీంద్రునకుం జెప్పిన నతం డతని నవ్వలికథావిధానం
బెట్లని యడుగుటయును. ॥100॥

శా. పారావారవిహార హారహిమరుక్పాటీరడిండీరమం
దార క్షీర తుషార పారద మరుద్గంధేభ తారా సుధా
పూరేందూపల హీర సార శరదంభోదాభ్రగంగానదృ
గ్గౌరస్ఫారయశఃప్రసార హితసంఖ్యావత్కులోద్ధారకా. ॥101॥

క. శంఖార్బుదసంఖ్యాహిత, పుంఖప్రాణాపహరణ భూరిరణాంచ
చ్ఛంఖగదాచక్రాయుధ, శంఖాణీకృతపరిష్ఠ గరుడశ్రేష్ఠా. ॥102॥

మాలిని. కథితశుభచరిత్రా కంజమిత్రాబ్జనేత్రా
మథితఖలసమాజా మండితాఖండతేజా
పృథులగుణవిహారా కృత్తమత్తారివీరా
ప్రథనవిగతశంకా పక్షిరాజోజ్జ్వలాంకా. ॥103॥

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితాసామ్రాజ్య
ధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచిగంగనామాత్యపుత్త్ర
సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ
తిమ్మకవిసార్వభౌమప్రణీతం బైనసర్పపురక్షేత్ర
మాహాత్మ్యం బనుపుణ్యచరిత్రంబునందు
ద్వితీయాశ్వాసము.

శ్రీశారదామ్బాయై నమః

సర్పపురమాహాత్మ్యము

తృతీయాశ్వాసము

రుచిరగుణాభరణా
నారదమునివినుతచరణ నతజనశరణా
ఘోరాంహస్సంహరణా
భూరిజగద్భరణ సర్పపురవరశరణా. ||1||

వ. అవధరింపుము శౌనకమహామునీంద్రున కగస్త్యుం డిట్లని చెప్పందొడంగె నట్లయ్యాగంతు
కాంగనారత్నంబు విప్రవాక్యప్రకారంబున నక్కాసారతీరంబు చేరి తజ్జలంబుల నవగాహనంబు చేసి. ||2||

స్త్రీరూపమును విడిచి నారదుండు నిజపూర్వవృత్తముల నెన్నుట

క. తటిదుపమానజటావలి, పటికపుజపమాల కరవిపంచియు ధవళో
త్కటతనువుఁ గలిగి మఱి యె, ప్పటినారదమునియ యగుచుఁ బటుగతి నిలిచెన్. ||3||

తే. జలధిలోపల వెడలిన శశియుఁబోలె, నిలిచి యత్యద్భుతం బాత్మ నివ్వటిల్ల
స్త్రీత్వసంపత్సుతాదివిస్తీర్ణపూర్వ, వర్తనం బెల్ల స్వప్నకల్పముగఁ దలఁచె. ||4||

ఆ. తలఁచి కొలను వెడలి తత్తటాంతికవన, భూమి నొక్కపుష్పభూరుహంబు
క్రిందఁ గూరుచుండి సందేహవివశిత, స్వాంతుఁ డగుచు మఱియు నాత్మలోన. ||5||

ఆ. ఏమియద్భుతం బి దేమియాశ్చర్య మి, దేమివిస్మయం బి దేమిచిత్ర
మేమిచోద్య మిది యహాముని పెన్నఁడు, విననికనని దొడ్డవింత పుట్టె. ||6||

సీ. కలఁ గంటిఁ గాఁబోలు గణుతించి చూచినఁ గల యనిద్రున కెట్లు గలుగనేర్చు
విశ్రాంతి కాఁబోలు వివరింప నది వస్తు, దర్శనంబునఁ గాని తవులుకొనదు
మోహంబు కాఁబోలు నూహింప దానిచే, నూరక తెలివి లేకుండవలయు
నైంద్రజాలక మేమొ యరసి చూడఁగ నట్టు, లైన నిందుఁ బ్రయోక్త గానిపింపఁ
తే. డహహ గలయును భ్రమయు మోహంబు నైంద్ర, జాలకంబును గాదు నిశ్చయ మి దేమి
యద్భుతం బంచుఁ బలుమఱు నాత్మలోన, నెంచుచు నొకింతతడవు చింతించుచుండె. ||7||

వ. అంత. ||8||

సీ. అంగనామణిరూప మబ్బుటయును మనో, జాతార్తియు నికుండ జనవరునకుఁ
బ్రియపత్ని యగుటయు బిడ్డల నూర్వురఁ, గనుటయు వారు సంగ్రామభూమిఁ
బడుటయు క్షుద్బాధ బడలుటయును శవ, సోపానసరణియు సూరివరుని
వచనప్రకారంబు వరుసతో స్మరియించి, మదిలోనఁ జాలవిస్మయముఁ బొంది
తే. యహహ యిది యెన్న విష్ణుమాయాప్రభావ, మంచు మానసమున నిశ్చయించి మున్ను
బ్రహ్మసభలోను నేను గర్వమునఁ బలికి, నట్టి ఫల మిప్పు డనుభవం బయ్యె నిజము. ||9||

వ. అని విచారించుచుండె నని యగస్త్యుండు శౌనకున కెఱింగించిన నతం డతనికి గ్రమ్మఱ నిట్లనియె. ||10||

తే. ప్రవిమలాత్మక కుంభసంభవ సురర్షి, యట్లు వర్తించుచో నిజం బరయ నెంత
కాల మయ్యె నెఱింగింపు కౌతుకంబు, మఱి మఱియు హెచ్చుచున్నది మానసమున. ||11||

క. అనిన నగస్త్యుఁడు పలికెన్, విను మొకత్రుటిమాత్ర మయ్యె వివరింపఁగ న
య్యనఘుఁడు మెలఁగినకాలము, మునివర విష్ణుప్రభావము గడిందిగదా. ||12||

వ. అనిన శౌనకుం డంతట నారదుం డెట్లు మెలంగె నెఱిఁగింపు మనినఁ గలశభవుం డిట్లనియె. ||13||

క. విను మునినాయక యిత్తెఱఁ, గున సురముని తెలివి దెచ్చుకొని యామోదం
బును ఘనశక్తియుఁ దనరఁగఁ, దనమది నఖిలేశు నిట్లు ధ్యానము చేసెన్. ||14||

క. ఎవ్వనిచే సృష్టం బగు, నివ్విశ్వము ప్రోదిసేయు నెవ్వాఁడు జగం
బెవ్వనియం దడఁగు న్మఱి, యవ్విభునకు నేను బ్రణతు లర్థి నొనర్తున్. ||15||

తే. అచ్చుగఁ జరాచరాత్మకంబైనయట్టి, యిజ్జగంబు సమస్తంబు నెవ్వఁ డయ్యె
నట్టిజగదీశునకుఁ బరమాత్మునకును, జిరకృపానిధి కే నమస్కృతు లొనర్తు. ||16||

తే.. సర్వభూతాంతరాత్ముని సర్వవిదుని, సర్వకారణభూతుని సర్వమయుని
సర్వదురితౌఘహరణుని సర్వహితుని, సర్వభువనైకనాయకు సంస్తుతింతు. ||17||

క. కమలావిభు నారాయణుఁ, గమలభవేశానజనకుఁ గమలాక్షు నరిం
దము శంఖచక్రయుతకర, కమలున్ భజియింతు హృదయకమలమునందున్. ||18||

తే. శేషపర్యంకశాయి యై క్షీరజలధి, యందు లక్ష్మీసమేతుఁ డై యలరువాని
నంతరిక్షంబుకైవడి నఖిలజగము, నిండుకొనియుండువాని నే నెఱిఁ దలంతు. ||19||

తే. ఆదిమధ్యాంతరహితుఁ డై యలరువాని, నాదిమధ్యాంతకారణుండైనవాని
నఖిలకర్మచయాభోక్త యైనవాని, నఖిలమఖభోక్తయగువాని నభినుతింతు. ||20||

సీ. ఏవిభుపదపద్మ మింద్రాదిసురశిరో, భృతపద్మరాగదీధితులఁ బెంచు
నేఘనునామంబు నిచ్చనైన వచింపఁ, గైవల్యనగరసౌఖ్యంబుఁ గూర్చు
నేదేవుమూర్తి యోగీంద్రమానసపద్మ, కర్ణికాంతరములఁ గలసి మెఱయు
నేప్రభుకరుణానిరీక్షణం బార్యుని, సకలకల్యాణభాజనముఁ జేయు
తే. మహిమ నెవ్వనిచారిత్ర మహరహంబు, బ్రహ్మహత్యాదిఘోరపాపము లడంచు
నయ్యనంతు రమాకాంతు నధికశాంతు, నిరుపమస్వాంతు భగవంతు నే భజింతు. ||21||

ఉ. కిన్నరసిద్ధసాధ్యసురఖేచరయక్షభుజంగముఖ్యు ల
త్యున్నతభక్తిఁ దన్ గొలుచుచుండిన వారల కెల్ల నెన్నఁడున్
బన్నము లంటనీయక కృపామతి నెవ్వఁడు ప్రోదిసేయు న
ప్పన్నగరాజశాయిని బ్రపన్నగణాభయదాయిఁ గొల్చెదన్. ||22||

తే. అనలుఁ డొక్క డయ్యు జగతిపై నన్నియెడల, స్థూలసూక్ష్మాకృతులఁ దనర్చుచు వెలుంగు
నట్లు దా సర్వభూతాంతరాత్ముఁ డగుచు, నలరు పరమాత్ము నెప్పుడు నాశ్రయింతు. ||23||

తే. వటునితెఱఁగున బహురూపనామభేద, ముల మెలంగుచు నేమహాత్ముఁ డచరాచ
రం బగుప్రపంచ మెల్ల నిరంతరముగ, నిండుకొనియుండు నవ్విశ్వనిలయుఁ గొల్తు. ||24||

తే. అజసహస్రాక్షముఖనిఖిలామరులును, మఱియు సనకాదికాశేషమౌనివరులు
మానసంబుల నెవ్వానిమాయఁ దవిలి, భ్రాంతి వహియింతు రమ్మహాప్రభు నుతింతు. ||25||

క. నీరజగర్భాండోదరు, నారాయణు నఖిలమునిజనత్రాణకళా
పారీణు సకలజగదా, ధారు ననాధారు మదిని దలఁతున్ భక్తిన్. ||26||

తే. నిఖిలకల్యాణగుణపయోనిధి కృపాబ్ధి, శంఖచక్రగదాధర సర్వఫలద
దేవదేవేశ పరమేశ దీనజనక, నిగమవేద్య ప్రసన్నుఁడ వగుము నాకు. ||27||

తే. అజ్ఞుఁడ జడుండ ని న్నెట్టు లభినుతింప, నేర్తు నజ్ఞానమునఁ జేసి నేను విష్ణు
మాయఁ గడచితి నన్నట్టిమాటతప్పు, క్షమ యొనర్చి రయంబ నన్ గావు మభవ. ||28||

తే. స్వామి భవదంఘ్రియుగసమాశ్రయణగౌర, వమున మూఢుఁడ నై నేన పల్కినట్టి
తప్పు సహియించి ప్రోవు మాధవ ముకుంద, పుండరీకాక్ష హరి సర్వభువనరక్ష. ||29||

నారదునకు విష్ణువు ప్రత్యక్ష మవుట

సీ. సర్వలోకేశ్వర సర్వశరణ్య యా, శ్రితజనవత్సల శ్రీనివాస
పద్మాక్ష మద్భావపరిశోధక కృపాబ్ధి, నారాయణ ముకుంద వారణేంద్ర
వరద గోవింద భవత్కటాక్షామృతాం, చితజలంబుల నభిషిక్తుఁ జేసి
నన్ను రక్షింపు మనాథనాథ యటంచు, దృఢభక్తిమైఁ బ్రస్తుతించుటయును
తే. నతనిభక్తికిఁ బ్రముదితస్వాంతుఁ డగుచు, భావనారాయణస్వామి పతగరాజ
వాహనుండును గరుణావి ర్ధనుండు, నగుచు నమ్మౌనిమ్రోలఁ బత్యక్ష మయ్యె. ||30||

వ. అప్పు డచింత్యాద్భుతరూపలావణ్యయౌవనామృతసముద్రుండును, దరుణారుణాంశు మండలమండితానర్ఘమణిగణకిరణసంఘాతదేదీప్యమానకిరీటాన్వితోత్తమాంగుండును, బురందరనీలనికాశకేశపాశుండును, సుప్రకాశుండును, శుచిస్మితసుధాపరిపూర్ణ పూర్ణిమాచంద్రబింబోపమానవదనుండును, జగత్సదనుండును, మకరకేతననూతన ధనుర్లతానదృశసవిభ్రమభ్రూయుగళుండును, గంబుకంఠుండును, బ్రభాతసమయ సముద్దీప్తసహస్రకిరణతరుణమయూఖౌఘప్రభిన్నసితాంభోజలోచనుండును, గలుష మోచనుండును, గించిదున్మీలితలాలితచాంపేయముకుళాభిరామసునాసుండును, మహోల్లాసుండును, ధాళధళ్యప్రభాపూరహారిహీరశకలోపమానరదనసముదయుం డును, సుహృదయుండును, వసంతావసరలసితనవకిసలాయాంభోజరాగసమాసమన్విత శోణాధరుండును, శ్రీధరుండును, మకరకుండలమణిఘృణివిరాజమానశ్రీకారరేఖా తులితకలితశబ్దగ్రహుండును, దుష్టనిగ్రహుండును, నవీనకందర్పదర్పణప్రతీకాశ ధగద్ధగాయమానగండభాగుండును, మహాభాగుండును, గనకకేయూరసరోరుహ మాలికారుచిరదిక్కరీంద్రశుండాలదండనదృగ్పీనవృత్తాజానుచతుర్బాహుండును, బ్రసన్నచాతకాంబువాహుండును, నిరుపమమాణిక్యఖచితశుచితరకనకకంకణా రుద్రముద్రికాకీర్ణనిర్ణి ద్రకోకనదచ్ఛవిచ్ఛటాభాసమానకరాంభోజుండును, దివ్యతేజుం డును, శ్రీవత్సకౌస్తుభాస్తోకముక్తాహారవనమాలికాసహితమహోరఃప్రదేశుండును, నిరీశుండును, యమునాతరంగరంగత్రిభంగుండును, నభంగుండును, సురుచిరరత్న సంస్థాపిత కాంచనకౌశేయవసనావృతకటిస్థలుండును, నిస్తులుండును, సమున్నతకలభ శరనిభోరుకాండుండును, మహాప్రభుండును, బ్రత్యగ్రముక్తాఫలవిమలనఖరాంకుర ప్రకరుండును, సుకరుండును, హలకులిశజలచరశంఖచక్రముఖలాంఛనాభిశోభిత సమదఝణత్కారనూపురాలంకృతచరణారవిందుండును, సదానందుండును, సజలజల దాభిరామశ్యామలకోమలదివ్యమంగళగాత్రుండును, ధాత్రీకళత్రుండును, నరిదరగదా ఖడ్గశార్ఙ్గోపేతుండును, బ్రహ్మాండభాండపిచండుండును, నఖండసచ్చిదానందవిగ్రహుం డును, నాదిమధ్యాంతరహితుండును, నఖిలభువనజనకుండును, ననంతసహస్రార్బుదమా ర్తాండతేజోవిరాజమానుండును, నభంగవీరపరాక్రముండును, నపవర్గలక్ష్మీప్రదుండును, ననేకాద్భుతదివ్యలీలావతారుండును, నపారకృపారసపేశలుండును, నాశ్రితరక్షాధురీ ణుండును, నార్తజనశరణ్యుండును, నాగమాంతవేద్యుండును, నభేద్యుండును, నజే యుండును, నప్రమేయుండును, నక్షరుండును, నాత్మమయుండును, ననంతుండును,

నద్వయియుండును, నభవుండును, నగునాయ్యాదినారాయణుం బొడగని సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి యమందానందకందళితహృదయారవిందుం డగుచుం గరకమలంబులు మొగిడ్చి నారదుం డిట్లని వినుతింపఁదొడంగె. ॥31॥

విష్ణువును నారదుండు వినుతించుట

సీ. సనకాదిమునిమనస్సరసిజభ్రమరాయ, వారణేన్ద్రవిపన్నివారణాయ
శతమఖప్రముఖనిర్జరగణప్రణుతాయ, ఘోరసంసారాబ్ధితారణాయ
నలినగర్భాణ్డమణ్డలబృహజ్జఠరాయ, క్రూరదైతేయవిదారణాయ
కమలావధూముఖకమలాబ్జమిత్రాయ, దరసుదర్శనశార్ఙ్గ ధారణాయ
తే. ఘనతరాశేషభువనైకకారణాయ, సతతపాలితమునిసిద్ధచారణాయ
సర్పనగరానవరతప్రచారణాయ, భావనారాయణాయ తుభ్యం నమోఽస్తు. ॥32॥

దండకము. శ్రీమత్పయోరాశికన్యాకుచద్వన్ద్వసంలిప్తకస్తూరికాగన్ధసారాఙ్కితస్ఫార దోరన్తరాళాయ విద్వన్మనస్సారకాసారమాద్యన్మరాళాయ నీళాపరీరమ్భసమ్భోగ కేళీవిహారా నిశాత్యన్తసుష్టచేతోరవిన్దాయ సంరక్షితామర్త్యబృన్దాయ కన్దర్పకో టీస్ఫురదివ్యసౌన్దర్యరేఖాపరిభాజమానాయ నానాయతీన్ద్రాజిరాజత్సన్నిధానాయ కారుణ్యమేధాసనాథాయ వేధోమరుత్వద్ధినాధీశకీనాశభేశానలాహీశముఖ్యామర స్తోమమస్తస్థలన్యస్తసౌవర్ణకోటీరకోటీరతామ్భోజరాగప్రభాపూరనీరాజితాఙ్ఘ్రిత్పదే ధోరితోగ్రాపదేశౌనకాగస్త్యవల్మీకజవ్యాసవాసిష్ఠకణ్వాత్రిగాధేయకౌణ్డిన్య శాణ్డిల్యమాణ్డవ్యముఖ్యాఖిలర్షీన్ద్రసంస్తూయమానస్థిరోదారభాస్వచ్చరిత్రాయ మి త్రేన్దునేత్రాయ మీనాద్యనన్తావతారాయ ధీరాయ ఘోరాఘసఙ్ఘాతశుష్కాటవీ హవ్యవాహాయ మానప్రకృష్టోరునామ్నేసముద్యన్మహిమ్నెపదాఙ్గుష్ఠనిష్ఠ్యూత గఙ్గాసరిన్నీరధారావళీక్షాళితాశేషదోషాయ నిత్యప్రతోషాయ దోషాచరాదభ్రకా లాభ్రఝఞ్ఝాసమీరాయ వీరాదివీరాయ క్షీరార్ణవాక్రాన్తలీలావిహారాయ పుణ్యప్రచారాయ జమ్బూనదన్నీతపీతామ్బ రాలఙ్కృతాఙ్ఘ్రిత్కటీరాయ శూరాయ గమ్భీరనీరాన్తరాళోగ్రకుమ్భీరసంరుద్ధకుమ్భిసంరక్షణాదమ్భసంరమ్భసమ్భాసమా నాయ సమ్మోదితాశేషదీనాయ నీరేజగర్భాణ్డభాణ్డచ్ఛటాపూరితోద్యత్ప్రచణ్డాయ సఙ్గ్రామకేళీప్రచణ్డాయ సృష్టిస్థితిధ్వంసనప్రక్రియాహేతవే పక్షిరాట్కేతనే పద్మ నాభాయ ప్రావృడ్ఘనాభాయ సద్భక్తసంరక్షణామోఘవిద్యాప్రవీణాయ వేదప్రమా ణాయ సంసారదుర్వ్యాధి వైద్యాయ వేదాన్తవేద్యాయ నిర్వాణసామ్రాజ్యలక్ష్మీప్రదా త్రే ప్రజానాథపిత్రే నమో విష్ణవే భాగ్యవర్ధిష్ణవే కృష్ణరూపాయ విశ్వస్వరూపాయ తుభ్యం నమ శ్శఙ్ఖచక్రాసికౌమోదకీశార్ఙ్గ హస్తాయ లోకప్రశస్తాయ తుభ్యం నమ స్సర్వకామార్థసంస్థాయినే సర్వభూతాన్తరస్థాయినే సర్పపూర్భావనారాయణ స్వామినే సిన్ధుజాకామినే సర్వలోకైకకర్త్రే నమ స్సర్వహర్త్రే నమో వాసుదేవాయ దేవాదిదేవాయ తుభ్యం నమస్తే నమస్తే నమః. ॥33॥

మ. పురుహూతప్రముఖాఖిలామరశిరోభూషాగ్రరత్నచ్ఛటా
నిరవద్యానుపమప్రభోత్కరముహుర్నీరాజితాంఘ్రిద్వయున్
శరణం బొందెద నిన్ను నన్ను నెపుడున్ సంప్రీతి రక్షింపు సు
స్థిరకారుణ్యకటాక్ష సర్పనగరశ్రీభావనారాయణా. ॥34॥

క. శతధృతిశతమఖముఖులున్, శ్రుతులుం గొనియాడలేనిచో నే నిన్నున్
నుతియింప నెంతవాఁడను, నతరక్షణదీక్ష సర్పనగరాధ్యక్షా. ॥35॥

క. ఏ మనియెద నాభాగ్యము, నీముఖచంద్రోదయమున నెఱి నుప్పొంగెన్
నామానసార్ణవం బిపు, డోమహనీయ ప్రభావయోగిశరణ్యా. ॥36॥

వ. మహాత్మా భవదాలోకనప్రసారణదవానలంబున మదీయపూర్వజన్మసంభృతకిల్బి షారణ్యంబు దగ్ధం బయ్యె భవదీయకృపాపూరప్రసారణంబున నఘానలతప్తంబులగు

నింద్రియంబులు ప్లావితంబు లయ్యె నింక మదజ్ఞానఘనధ్వాంతవిభాకరుండ వగునిన్ను నెప్పుడు ధ్యానం బొనర్చెద నీయనంతకల్యాణగుణానీకం బనవరతంబుఁ గీర్తించెద భవద్భక్తపదాంభోజదర్శనమనోరథుండ నై మూఁడులోకంబుల సంచరించె నని ప్రార్థించుచున్న నారదునకు భగవంతుం డిట్లనియె. ||37||

నారదునకు విష్ణు వనుగ్రహంబుఁ జూపుట

సీ. నీయభిప్రాయంబు నే నెఱుంగుదు వత్స, సకలభూతాంతరాత్మకుఁడ నైన
నా కెద్దియును గానరాకుండునది లేదు, నామాయఁ దరియింప నాకులకు మ
హర్షుల కైన శక్యంబుగా దిట్లు లో, కుల కిది దెలుపుట కొఱకుఁ బూని
యే నీ చేతఁ జేయించితి నింక నీ, వళుకక స్థైర్యంబు గలిగియుండు

తే. ధరణి నీపేర నీసరోవర మశేష, పాతకవ్రాతనాశకమై తనర్చు
నిజ్జలంబుల మునిఁగినసజ్జనుండు, పొసఁగ నఖిలశుభంబులఁ బొందుఁజుమ్మి. ||38||

తే. అమితకలుషాకరం బగు నట్టిస్త్రీత్వ, మాగతం బయ్యె నిత్తటాకావగాహ
నమున నటు లైన నిది భవన్నామకమున, వఱలుఁబో నీవు మద్భక్తవరుఁడ వగుట. ||39||

తే. ఇత్తటాకంబు మది స్మరియించుజనుల, కఖిలకలుషాపహరణంబు యతికులేంద్ర
సంతసంబున మునిఁగెడు స్నాతజనుల కెల్ల నిది పుత్త్రసంపత్సమృద్ధిదంబు. ||40||

క. విను మత్సంకల్పంబున, మునివల్లభ నీకు స్త్రీత్వము ఘటిల్లె నటుల్
జనులు మత్సంకల్పం, బునఁ గడుశుభసంతతులను బొందుదురుసుమీ. ||41||

తే. మునికులోత్తంస యద్భుతంబుగను నీకు, నంగనాత్వవినిర్ముక్తి యయ్యెఁ గాన
నది ధరిత్రీస్థలిఁ బ్రసిద్ధ మగుచు నెపుడు, ముక్తికాసార మనుపేర మొనసియుండు. ||42||

క. ఇచ్చెఱువున మునిఁగినజనుఁ, డచ్చెరువుగ దురితరహితుఁ డై శుభఫలముల్
గ్రొచ్చుకొని యనుభవించుచు, విచ్చలవిడిఁ బుత్త్రపౌత్త్రవృద్ధిఁ జెలంగున్. ||43||

క. ఇది మొదలుగ నీసరసిన్, ముదమునఁ గ్రుంకు లిడుజనుఁడు ముక్తుండై మ
త్పదమునకు నరుగుఁ గొదుకక, తుది భవబంధములఁ బాసి ద్రుహిణతనూజా. ||44||

తే. సిద్ధముగ ముక్తికాసారజీవనావ, గాహన జనాఘనిచయ మొక్కటను నూర్పు
లూర్చుచును రోదనంబు సేయుచును జాల, నద్భుతముగఁ బలాయితం బగుచు నుండు. ||45||

తే. గణుతి యొనరింప మూఁడులోకములయందుఁ, బావనము లైనతీర్థంబు లేవి గలవ
వన్నియును నిందు వసియించు నహరహంబు, నమరమునిచంద్ర విను సంశయంబు లేదు. ||46||

తే. అవని మానవుఁ డిచ్చ లే కైన నీస, రోవరోదక మించుక గ్రోలెనేని
యాక్షణంబున వెసఁ బలాయనము నందు, బ్రహ్మహత్యాదికము లైన పాతకములు. ||47||

తే. ముక్తికాసార మనుపేరు మొనసి మనుజుఁ, డాత్మలోపల స్మరియించు నంతమాత్ర
మున నశేషాఘభవబంధములను బాయు, స్నానఫల మేమి చెప్పుదు సంయమీంద్ర. ||48||

తే. గ్రహణవేళల విషువసంక్రాంతితిథుల, నయనములయందు మూలాన్వితాహములను
దవిలి స్నానం బొనర్చినధన్యుఁ డొందు, నశ్వమేధసహస్రసమ్యక్ఫలంబు. ||49||

తే. పూషుఁడు మకరస్థుం డైనపుడును మాఘ, మాసములయందు నాదిత్యవాసరముల
హరిదినంబుల స్నాన మం దాచరించు, ఫలము వాక్రువ్వ నజనకు నలవి గాదు. ||50||

సీ. ఇమ్ముక్తిసరసీతటమ్మున విమలోద, కములచేత నివాపకరణ మాచ
రించుటవలనఁ బితృశ్రేణులకు ముక్తి, కరతలస్థం బయి పరఁగు జహ్ను

తనయాదిపుణ్యతీర్థములనివాపాంజ, లులచేత నయ్యెడుఫలము జనుల
కిచ్చుట సిద్ధించు నెన్నంగ గంగాది, పుణ్యతీర్థము లెన్ని భువిని గలుగు
తే. నన్నియును నిందు వసియించు నహరహంబు, ఘనతరంబుగ నాదుసంకల్పముననను
బితరులకు నెవ్వఁ డిచ్చోటఁ బిండ మొసఁగు, నతఁడు తరియింపఁజేయు స్వపితృజనులను. ‖ 51‖

క. వటవిటపిక్రింద గయలోఁ, బటుమతిఁ బిండంబు విష్ణుపదమున నిడుమేల్
ఘటియించు ముక్తిసరసీ, తటమునఁ బిండం బొసంగు ధన్యాత్ములకున్. ‖52‖

తే. అఖిలయజ్ఞభోక్త నైననే నిచ్చుట, నధివసించి జనుల కఖిలఫలము
లొసఁగుచుందు వినుము యోగికులోత్తమ, మహిమ విస్తరిల్ల నహరహంబు. ‖53‖

క. నీమీఁదిప్రేమమున నిం, దోమునివర విలిచియుందు నుర్వి జనులచే
నేమమునఁ బూజగొనుచు మ, ఱే మిఁక దుర్లభము జనుల కిలఁ గల దరయన్. ‖54‖

క. నారద యిమ్ముక్తిసర, స్తీరంబునఁ జేయుజప ముచితదానంబుం
బేరిమి నప్పుడె జనులకు, సారం బైనట్టిఫలము సమకూర్చుఁజుమీ. ‖55‖

సీ. విను మింక మాటలు వేయు నేల మునీంద్ర, గురుతల్పగసురాపగోఘ్నమాతృ
హులుఁ బరదారరతులు భ్రూణహులును బ్ర, హ్మఘ్నులుఁ గనకాపహరణు లాది
గలమహాపాతకు లెలమి నీసరసీద్వ, యంబున స్నానంబు లాడిరేని
యప్పుడే వారు ఘోరాఘనిర్ముక్తులై, సురుచిరైశ్వర్యంబు సుతసమృద్ధి
తే. యాయురారోగ్యసంపద యతిశయిల్ల, నంత్యమున విష్ణులోకసౌఖ్యానుభవని
రంతరామోదమేదురస్వాంతు లగుచు, నలరుచుందురుసుమ్ము తథ్యంబు గాఁగ. ‖56‖

వ. అని యిట్లు భగవంతుం డానతిచ్చిన నారదుం డమ్మహానుభావున కిట్లని విన్నవించె. ‖57‖

తే. అభవ మద్భావమాలిన్య మపహరించు, కొఱకు నీ విలఁ బ్రఖ్యాతి మెఱయ నిందు
భావనారాయణస్వామి వై వసించి, యున్నవాఁడవుగద భువనోపకృతిగ. ‖58‖

తే. రమ్యపాదపనివహవిరాజితంబు, పావనం బైనయీసరోవరతటమున
రూఢి మీఱంగ నర్చాస్య రూపముననను, వనజలోచన నీ వుండవలయుఁజుమ్మి. ‖59‖

వ. అయిన నిన్నుఁ బ్రతిష్ఠాపితుం జేసెదనని యుత్సహించెద దానంజేసి నాకు నిద్దోషంబు
పరిహారం బగు భవత్కటాక్షవిక్షేపంబునఁ బ్రసిద్ధుండ నగుదుఁగదా యని విన్నవించిన
జనార్దనుండు వెండియు నతని కిట్లనియె. ‖60‖

తే. మున్న చెప్పితిఁ బన్నగముఖ్యుఁ డైన, యయ్యనంతుని కిమ్మాట నెయ్య మలర
నట్లు గావున నిచ్చోట నధివసింతు, నట్లె కావింపు మిఁక మునీంద్రాగ్రగణ్య. ‖61‖

వ. అని యాశ్రితాధీనవర్తనుం డగుగరుడధ్వజుం డానతిచ్చిన లోకానందకరం బైనవాక్యం
బఖిలంబు నాకర్ణించి పరితుష్టుఁ డగుచు నమ్మునిశ్రేష్ఠుండు ప్రతిష్ఠావిధానంబుఁ బ్రయ
త్నంబు సేసె నని శౌనకున కగస్త్యుం డెఱింగించినఁ గ్రమ్మఱ నతం డతని కిట్లనియె. ‖62‖

నారదుఁడు భావనారాయణునిఁ బ్రతిష్ఠ సేయుట

క. ఆరయ నఖిలజ్ఞుం డగు, నారదమునివరుఁడు భావనారాయణు ల
క్ష్మీరమణీరమఃణునిఁ దా, నేరేతిఁ బ్రతిష్ఠ సేసె నెఱిఁగింపఁగదే. ‖63‖

వ. విస్మయానందకారణం బగుప్రతిష్ఠావైభవంబు నాకుం దెలుపు మనినఁ గలశోద్భవుం
డిట్లనియె. ‖64‖

క. శంభుఁడు జంభవిరోధియు, నంభోజభవుండు శశియు నర్కుఁడు దివిజుల్
రంభాదులు మునులున్ సం, రంభంబున వచ్చి రపుడు రహి నచ్చటికిన్. ‖65‖

వ. అప్పు డజజుండు నభోమాసంబున శుక్లపక్షంబున గురువాసరంబున సింహలగ్నంబునఁ
గనత్కనకప్రాకారసంవృతంబును రత్నగోపురవిరాజితంబును జిరత్నరత్నఖచితవిత
ర్దికాసోపానమండపకుట్టిమద్వారబంధబంధురంబును మణిస్తంభసహస్రభాసితంబును
విశ్వకర్మనిర్మితంబు నగుమహనీయప్రాసాదాంతరంబున సముత్తుంగభద్రసింహాసనం
బున శ్రీమద్భావనారాయణదేవు లక్ష్మీసమేతు విధ్యుక్తహకారంబున సంస్థాపితుం జేసె
నయ్యవసరంబున. ॥66॥

సీ. దేవదుందుభిమహారావంబు లెసఁగె గం, ధర్వకిన్నరులు గీతములు వాడి
రప్సరోభామిను లదనొప్ప నాడిరి, జలదముల్ పుష్పవర్షంబు గురిసె
మునులు సామామ్నాయముల వినుతించిరి, మునుకొని శుభతూర్యములు సెలంగె
ననిమిషుల్ జయజయధ్వనులతోఁ గీర్తించి, రనుకూలగంధవాహములు వీచె
తే. నంత బ్రహపురందరాద్యమరవరులు, నారదాదిమహామునినాయకులును
భావనారాయణస్వామి దేవదేవుఁ, బ్రీతిఁ బొగడిరి మంగళగీతములను. ॥67॥

వ. వెండియు నద్దేవు నిట్లని వినుతించిరి. ॥68॥

దివిజమునిముఖ్యులు స్వామిని నుతించుట

తే. దేవదేవ జనార్దన దివిజవినుత, యఖిలలోకైకకారణ యప్రమేయ
భూతభవ్యభవన్నాథ భువనవంద్య, వేదవేద్య రమాధీశ విశ్వనిలయ. ॥69॥

సీ. దివి మస్తకము చంద్రదినకరుల్ కన్నులు, వహ్ని ముఖంబు దేవతలు భుజము
లవని యంఘ్రులు విహాయసము పొక్కిలి దిశల్, శ్రవణంబు లామ్నాయసమితి వాక్కు
లనిలుఁడు ప్రాణంబు యముఁడు మానసము నా, కంబు కంధరమును గచభరంబు
భారతి నాలుక పాథోనిధులు కుక్షి, క్రతుభుక్చికిత్సకుల్ కటితలంబు
తే. గాఁగ విశ్వస్వరూపి వై కరము మెఱయు, చుండు నీమేన నలినగర్భాండభాండ
మండలు లుదుంబరఫలోపమానము లయి, వెలయుచుండుఁగదా జగద్వినుతచరిత. ॥70॥

వ. అనంతబ్రహ్మాండసంఘాతంబు లెవ్వనినిశ్వాసోచ్ఛ్వాసద్వయంబున విడువం బడుచు
నాహరింపంబడుచుండు నెవ్వనినిమేషోన్మేషంబుల నఖిలలోకసముదయం బడఁగుచుం
బొడముచుండు నట్టియఖిలలోకశరణ్యుండ వగునట్టినీకు నమస్కారంబు. ॥71॥

తే. అమరవరులకు నైన మహర్షిజనుల, కైన నీమాయఁ గడవ శక్యంబు గాదు
హీనమతు లగువారి కిం కేమి చెప్ప, భక్తవత్సల జగదీశ పరమపురుష. ॥72॥

తే. మౌనిజనవంద్య మమ్ము నీమాయవలన, దాఁటఁగాఁ జేయు మేతదర్థంబు నిన్ను
శరణుఁ గంటిమి నీపాదజలజయుగము, కన్న మా కన్యసాధనం బెన్నఁ గలదె. ॥73॥

క. శరణాగతజనభయసం, హరణాయ సమస్తమునిజనార్చితశుభకృ
చ్చరణాయ నిత్యనిర్మల, కరుణాయ సుధీనుతప్రకరణాయ నమః. ॥74॥

వ. అని యిట్లు బహుప్రకారంబుల నద్దేవదేవుం బ్రణుతించి మఱియు శ్రీమహాలక్ష్మి నిట్లని
వినుతించిరి. ॥75॥

దివిజమునిముఖ్యులు లక్ష్మిని నుతించుట

క. కమలా బుధజననుతపద, కమలా కరధృతనవీనకమలా విలస
త్కమలావాసిని మము నీ, విమలకృపాలోకనమున వీక్షింపఁగదే. ॥76॥

తే. మణిమయస్వర్ణపూర్ణకుంభములు పూని, తవిలి యిరుగడఁ గరికులేంద్రములు గొల్వఁ
జామరంబులు పూని నిర్జరవధూటు, లెలమి భజియింప నలరు నిన్ గొలుతు మంబ. ॥77॥

ఉ. నీకరుణావిలోకనము నిల్చినచోఁ గులహీనుఁడున్ హయా
నేకపహేమచామరమణీరమణీయవిభూషణాదికా
స్తోకవిభూతిఁ జెంది పరిశుద్ధకులుం డన మించు లేనిచో
నాకనివాసుఁడున్ వెతల నందుఁ గదమ్మ జగత్కుటుంబినీ. ॥78॥

చ. ఉవిద లనంగుఁ డంచు విబుధోత్తము లర్కతనూజుఁ డంచు శా
త్రవులు కిరీటి యంచు వసుధాజనులెల్లఁ బ్రభుం డటంచు బాం
ధవులు సముద్రుఁ డంచు వితతంబుగ నెన్నుదు రెట్టిదుర్జన
ప్రవరుని నైన నీకరుణ పర్వినవాని సరోజగేహినీ. ॥79॥

మ. పురజిద్దానవజిత్సుధాశనవరాంభోధీశయక్షాధిపా
శరరాడ్వహ్నిసరేతరాజమరుదీశానాదికం బైనయీ
సురబృందంబు భవత్కృపాగరిమ నక్షుద్రప్రభావంబుతో
నిరవొందుంగద కేశపాశజితమత్తేందిందిరా యిందిరా. ॥80॥

క. ఓజనని నీవు గలచో, నేజాతివిహీను నైన నిలఁ గొలుతురుగా
రాజులుఁ గవిరాజులు బుధ, రాజులు గమికట్టి కడలిరాయనిపట్టీ. ॥81॥

చ. మతి మఱి పూను నుస్సురను మందతఁ జెందుఁ గృశించు మాటికిన్
వెత పడు నీచవర్తనుల వేఁడఁగఁ జూచు విధిన్ నళించు లో
ధృతి చెడి క్రుంగుఁ జెంగగొను నెట్టిమహోన్నతుఁ డైన నీ జగ
ద్ధితకరుణారసప్లుతనిరీక్షణ మబ్బనివేళ శ్రీసతీ. ॥82॥

చ. అతితరవేదశాస్త్రనిగమాంతపురాణకథావిధానవి
శ్రుతుని దరిద్రుఁ జేయుదువు చూడ నికృష్టుఁ బ్రకృష్టభాగ్యసం
యుతునిఁగఁ జేయుచుండుదు వహో పరికింప జగంబులందు న
ద్భుతముగదమ్మ నీమహిమ తోయజనాభవిలాసినీమణీ. ॥83॥

సీ. కదసి ని న్నిల్లాలిఁ గాఁ జేసికొనిగదా, హరి పురుషోత్తముం డనఁగఁ బరఁగెఁ
దివిరి నీతోడ నుద్భవము నొందుటఁ గదా, శశికి రాజత్వంబు సంభవించెఁ
గోరి ని న్గారాపుఁగూఁతుఁ గాంచుటఁగదా, వనరాశి రత్నాధివాస మయ్యెఁ
దర్కింపఁ నీకు నందనుఁ డౌటచేఁగదా, మారుండు మోహనాకారుఁ డయ్యె
తే. నహహ భవదీయదివ్యమాహాత్మ్య మెన్న, నలవి గాదు గదమ్మ శేషాహి కైనఁ
గలితశుభగాత్రి పరిచితకాళరాత్రి, సకలలోకైకజనయిత్రి జలధిపుత్త్రి. ॥84॥

వ. అని వినుతించుదివిజమహర్షివరులం గనుంగొని యానందోత్ఫుల్లమానసుం డగుచుఁ
బితామహుం డిట్లనియె. ॥85॥

బ్రహ్మ దేవాదులకు హితంబు బోధించుట

క. సురలార పరమసంయమి, వరులార సమస్తభువనవంద్యుం డగునీ
హరి నీక్షింపుఁడు మీకుం, జిరతరశుభఫలము లిపుడె చేతికి వచ్చున్. ॥86॥

క. కనుఁగొనుఁ డిద్దేవుని లో, చనములు గలఫలము పూజ సలుపుఁడు కరముల్
దనరుటకు ఫలము జిహ్వాక, యొనరుటకు ఫలంబు పొగడుఁ డురగశయానున్. ॥87॥

తే. శ్రుతులు గలఫల మిమ్మహోన్నతునికథలు, వినుఁడు చరణద్వయంబు గల్గినఫలంబు
పాయక ప్రదక్షిణంబులు సేయుఁ డుత్త, మాంగము గలందులకు మ్రొక్కుఁ డచ్యుతునకు. ॥
88॥

తే. వినుఁడు సురలార మునులార వీను లలర, భావనారాయణునకు సద్భక్తితోడ
ధరణిఁ జాఁగిలి మ్రొక్కిన ధన్యతముఁడు, నిఖిలలోకైకపూజ్యుఁ డై నివ్వటిల్లు. ॥89॥

క. ముద మొదవఁగ నిస్వామికిఁ, గదసి ప్రదక్షిణము భక్తిఁ గావించుమహా
సదమలతరమానసులకు, బదపదమున నశ్వమేధఫలము లభించున్. ||90||

తే. భృగుదినంబున నీజగద్విభుని నెవ్వఁ, డవిరళంబుగ నభిషేక మాచరించు
వాఁడు నిస్తులశాశ్వతైశ్వర్యధుర్యుఁ, డగుచు ధాత్రీతలంబున నతిశయిల్లు. ||91||

తే. అవని నెవ్వండు భావనారాయణునకుఁ, గుసుమమాలిక లర్పించుఁ గోర్కి మీఱ
నతఁ డదభ్రసుఖావహం బైనయట్టి, దివ్యదేహంబు దాల్చి నర్తించు దివిని. ||92||

తే. భావనారాయణాహ్వయస్వామిమ్రోలఁ, గడఁగి మంగళదీప మేఘనుఁడు నిలుపు
నతనిఘోరాఘనిచయంబు లళికి యుఱకుఁ, గమలమిత్త్రోదయమునఁ జీఁకటులువోలె. ||93||

తే. గుడపయోఘృతమిశ్ర మై గుబులుకొను హ, విష్య మెవ్వాఁడు స్వామి కర్పించు భక్తి
వితతముగ నాతఁడు పునరావృత్తిరహిత, శాశ్వతబ్రహ్మలోకైకసౌఖ్య మొందు. ||94||

క. ఇద్ధరణీధరుప్రసాదము, శుద్ధాత్ముం డగుచు ముదము సొం పెనలారన్
సిద్ధార్థమాత్ర మెవ్వఁడు, సిద్ధంబుగ మెసఁగు నతఁడు సిద్ధార్థుఁ డగున్. ||95||

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. ||96||

సీ. భావనారాయణదేవుని సేవింపఁ, దప్పక యేఁటేఁటఁ దవిలి యేను
సంతసంబున ధనుస్సంక్రమణంబుల, వాణీయుతుండనై వచ్చుచుందు
మీరును దప్పక దారసమేతు లై, వాలెంబు నిచటికి వచ్చుచుండి
యిద్దేవు దర్శించి యెలమి బ్రదక్షిణ, నతినుతిపూజాభిరతుల నలరఁ
తే. జేయుచుండుఁడు పూజ్యతఁ జెంది కడుఁ గృ, తార్థు లయ్యెద రెవ్వఁ డీహరికి ధన్వ
మాసమున నించుక హవిస్సమర్పణంబు, చేసెనేని యతం డొందు సిద్ధపదము. ||97||

తే. ఒనర నుత్తరఫల్గునీయుక్త మైన, హరిదినంబున వృషభంబునందు నినుఁడు
మలయునప్పుడు వైశాఖమాసమునను, రండు మీ రిందు మరలఁ బెంబండువుగను. ||98||

సీ. వచ్చి మీ రందఱు వైశాఖమునఁ దార, సిలి యర్ఘ్యపాద్యాభిషేచనములఁ
జందనాగరుఘనసారకాశ్మీరక, ద్రవధూపదీపనీరాజనముల
మందారకేతకీమల్లికాచంపక, నవతులసీదళనివహములను
బనసరసాలరంభానారికేళఖ, ర్జూరకాదికఫలస్తోమములను
తే. భక్తి దైవాఱఁ బానీయభక్ష్యభోజ్య, లేహ్యచోష్యాదికముల నాళీకనేత్రు
భావనారాయణుని మహాప్రభునిఁ దృప్తుఁ, జేసి తత్కృప వడయుఁ డీప్సితము లొదవు. ||99||

తే. భావనారాయణార్పితపావనప్ర, సాదములు గొని చనుఁడు మీస్థానములకు
నివ్విభుననుజ్ఞు వడసి యేఁటేఁట నిట్లు, వచ్చుచుండుఁడు నియమంబు వాటిలంగ. ||100||

తే. భావనారాయణుని మహాప్రభుని నీశు, భాసురం బగువైశాఖమాసమునను
గనుచుఁ బొగడుచు నుతుల నర్చనల నిడుచు, జనుఁ డభీష్టఫలంబులు నెనయుఁజుండి. ||101||

వ. అని తెలుపుచున్న యప్పద్మసంభవునకు దివిజమహర్షిపుంగవు లిట్లని విన్నవించిరి. ||102||

సీ. అఖిలాండనాయక యజ్ఞగర్భ సమస్త, నిర్జరనాథ వాణీసహాయ
భావనారాయణదేవుని సేవించి, సంతుష్టుఁ జేయ మే మెంతవార
మీవె సమర్థుఁడ వీక్షణధ్యానస, న్నుతీసపర్యానమస్కృతులయందు
నైన నీయాజ్ఞ గాదనక ప్రత్యబ్దంబు, వాలెంబు నిచటికి వచ్చి దేవ
తే. దేవు బ్రహ్మాండనాయకు దివిజవంద్యు, నిందిరాధీశు సనకసనందనాది
పరమమునిగేయు బుధజనభాగధేయుఁ, గరము భజియించెదము భక్తవరద యనఘ. ||103||

వ. మఱియు నుత్ఫుల్లగండస్థలయుగళుండును బుండరీకదళాయతేక్షణుండును దరస్మిత
చంద్రికావికాసాపసారితకలుషాంధకారుండును శంఖచక్రగదాభయప్రదర్శకభుజో

జ్జ్వలుండును దనుమధ్యుండును శ్రీవత్సకౌస్తుభాంభోధితనయావానతనుమధ్యుండును జగ జ్జనధరుండును బీతకౌశేరేయవాసుండును శారదాంభోజనీకాశపదద్వయరాజితుండును సర్వప్రభుండును నగుశ్రీమద్భావనారాయణమహాప్రభుసేవార్థంబు కళత్రబాంధవో పేతుల మై ధనుర్మాసవైశాఖమాసంబులు నీవెంబడి వచ్చుచుండెద మని విన్నవించు చున్నసమయంబున శంభుండు భావనారాయణస్వామి నిట్లని వినుతించె. ||104||

శంభుఁడు భావనారాయణస్వామిని నుతించుట

తే. మహియు సలిలంబుఁ దేజంబు మారుతాభ్ర, ములు మనోబుద్ధ్యహంకారములును భిన్న
సరణి లయ్యు నభిన్నతఁ బరఁగి యేమ, హామహనిరూప మయ్యె నయ్యనఘుఁ గొలుతు. ||105||

వ. మఱియు నాబ్రహ్మస్తంబపర్యంతంబు స్థావరజంగమాత్మకం బగుజగం బెవ్వనిలీలాపరి కరం బట్టినీకు నమస్కారంబు నేనును జతుర్ముఖసోమసూర్యపురందరాదిసమస్తదేవత లు నెవ్వనితనుభూతంబుల మైతి మట్టినీకు నమస్కారం బీశ్వరత్వాభిమానుల మగు మముబోంట్లఁ బ్రతిబోధించుటకై నారదునకు స్త్రీత్వంబును బురుషసంసర్గంబును బుత్త్ర శతోదయంబును దత్పంచత్వంబున నత్యంతదుఃఖంబును గల్పించి క్షణమాత్రంబున గ్రమ్మఱ మహర్షిం జేసి పరతంత్రుండ వై పరఁగుచున్న నీమహత్త్వంబు తెలియ నెవ్వం డర్హుండు నీవు నా కిట్టినిశ్చలబుద్ధి యొసంగు మని ప్రార్థించుచున్నసమయంబున నారదుండు హరి కిట్లనియె. ||106||

నారదుండు హరిని వేఁడుకొనుట

తే. భావనారాయణ కృపాబ్ధి దేవదేవ, నిఖిలలోకశరణ్యా నే నిన్ను శరణు
నందుదు ననారతంబు నాయందుఁ గలుగు, వత్సలత నిందు నీ వుండవలయుఁజుమ్మి. ||107||

సీ. పుణ్యమానసు లైన పురుషులచేత నా, రాధ్యమానుండ వై రహిని వా రొ
సంగుతత్తత్కాలసముచితారాధనం, బులఁ దృప్తిఁ బొందుచు నలర వారి
కీప్సితార్థఫలంబు లిడుచు శ్రీదేవియు, భూదేవి నీళయు భుజగవిభుడుఁ
బతగేంద్ర సేనేశ పరివారములుఁ గొల్వ, వైకుంఠమున నుండు వల నెనంగఁ
తే. జిరతరంబుగ నిమ్మహాక్షేత్రమున వ, సించి యాశ్రితజనుల రక్షించుచుండు
సర్పపురవాస భువనరక్షణవిలాస, భావనారాయణ మహానుభావ దేవ. ||108||

క. మంగళము నీకు శ్రితజన, మంగళదాయక మునీంద్రమానసవిలస
ద్భృంగాయమానవిగ్రహ, మంగళ మఖిలాండకోటి మహితపిచండా. ||109||

సీ. మఙ్గళ మస్తు రమాముఖాబ్జపతఙ్గ, మఙ్గళ మస్తు భుజఙ్గశయన
మఙ్గళ మస్తు సామజరాజపరిపాల, మఙ్గళ మస్తు విహఙ్గగమన
మఙ్గళ మస్తు మన్మథసున్దరాకార, మఙ్గళ మస్తు కల్మషవిభఙ్గ
మఙ్గళ మస్తు కోమలదివ్యవిగ్రహ, మఙ్గళ మస్తు రథాఙ్గహస్త
తే. మఙ్గళం తే కమలజాణ్డమహితజఠర, సర్పపురవాస భక్తరక్షణవిలాస
భావనారాయణప్రభువర సమస్త, మఙ్గళాని భవన్తు తే మదనజనక. ||110||

ఉ. మంగళ మిందిరావిమలమానసనవ్యసరోరుహాళికిన్
మంగ మాశ్రితావనసమగ్రకళావిలసద్గుణాళికిన్
మంగళ ముగ్రదానవతమస్సమవాయకరాళహేళికిన్
మంగళ మండజప్రవరమంజులపాలికి దేవమౌళికిన్. ||111||

వ. అని యనేకప్రకారంబులఁ బ్రార్థించుచున్న నారదమునీంద్రునకు భగవంతుండు మేఘ
గంభీరవాక్యంబుల నిట్లనియె. ॥112॥

భగవంతుండు నారదునియెడఁ బ్రీతుఁ డగుట

సీ. నారద యిందు రమారమణీభావ, ధూనీళలను వేడ్కతోడఁ గూడి
మానితచ్ఛత్రచామరపాణు లగుదివ్య, సూరిజనుల్ గొల్వ సుభగలీల
నాశ్రితావళి కీప్సితార్థము లొసఁగుచు, నురువైభవంబున నుండువాఁడ
భువి మదీయక్షేత్రములు నూటయెన్మిది, గల వందు సర్వనగరమహాప్ర
తే. భావ మెంతయు నధిక మై పరఁగు దీని, యైదుకోసుల నుండుచరాచరములు
మత్స్వరూపంబులు నిజంబు మది నెఱుంగు, వినుతగుణగణ్యా నారదమునివరేణ్యా. ॥113॥

ఆ. మూఁడుదినము లిందు ముద మొప్ప నెవ్వాఁడు, నిలిచియుండు భక్తి నివ్వటిల్ల
నజ్జనుండు శతసహస్రాశ్వమేధఫ, లంబుఁ జెందు నిశ్చయంబు గాఁగ. ॥114॥

క. జనుఁ డీక్షేత్రము దర్శిం, చినఁ బుణ్యం బొదవుఁ బ్రణతిఁ జేసినఘనపు
ణ్యున కపవర్గము కరతల, మునకున్ వచ్చును నిజంబు మునివరతిలకా. ॥115॥

క. నరుఁ డంత్యమునందుఁ గళే, బర మిచ్చట విడిచెనేని భవముక్తుం డై
పరమపదప్రాప్తుం డగు, సరియొదవనిటీవి నార్యజనులు నుతింపన్. ॥116॥

గ్రంథఫలాదిస్తుతి

వ. అని యిట్లు భగవంతుండు నారదునకుం జెప్పి దివిజర్షివరులకు యథాస్థానంబులకుం బోవ
నాజ్ఞ యొసంగిన నంత బ్రహ్మాదిదేవతలును నారదాదిమహర్షులును భావనారాయణ
స్వామికి నమస్కారంబు లొసంగి చనిరి ముక్తికాసారనీరంబుల మునింగి
భావనారాయణదేవుని దర్శించిననరుండు శుభసంతతులఁ బొంది పునర్జన్మరహితుం
డగు నీక్షేత్రమాహాత్మ్యంబు వినిన వినిపించినఁ బఠించిన లిఖించిన నజ్జనుండు
విష్ణులోకప్రాప్తుం డగు నని కుంభసంభవుండు శౌనకునకుఁ జెప్పిన విని వసిష్ఠుం
డంబరీషున కెఱింగించిన నతం డత్యంతసంతుష్టాంతరంగుం డయ్యె. ॥117॥

సీ. వల నొప్ప బ్రహ్మకైవర్తపురాణోక్త, మై సర్వనగరమాహాత్మ్య మలరు
నది యేను శాలివాహనశకాబ్దంబులు, పాటింప వేయునార్నూటడెబ్బ
దా ఱగుభావమహావత్సరంబున, భావనారాయణ దేవదేవు
నానతివలన ని ట్లాంధ్రం బొనర్చి యా, స్వామికి దేవతాచక్రవర్తి
తే. కర్పణం బొనరించితి నధికభక్తి, నిమ్మహాపుణ్యచారిత్ర మిద్ధరిత్రి
నాసుధాకరతారార్క మగుచు సజ్జ, నోత్తములయిండ్ల నెప్పొద్దు నుండుఁగాత. ॥118॥

చ. పరమకృపాలవాల నిజభక్తజనావనశీల యోగిహృ
త్సరసరోమరాళ దివిషన్మునిసంస్తుతిలోల దీనమం
దిరమురసాల సంప్రథితనిర్మలకీర్తివిశాల యక్షకి
న్నరనరసాధ్య ముఖ్యసుమనస్సముదాయనితాంతపాలనా. ॥119॥

క. అక్షుద్రభుజపరాక్రమ, శిక్షితదైతేయ నిఖిలశిష్టవిధేయా
చక్షుఃకర్ణకదంబా, ధ్యక్షాంగశయాన బుధవితాననిధానా. ॥120॥

తరలము. దర సుదర్శనశార్ఙ్గ నందకధారణా శుభకారణా
హరిహయప్రముఖాఖిలత్రిదశావనా మునిపావనా
సురవిరోధివరూథినీపరిశోషణా నతపోషణా
వరశకుంతకులాధినాయకవాహనా నవమోహనా. ॥121॥

గద్యము. ఇది శ్రీమత్కుక్కుటేశ్వరకరుణాకటాక్షనిరీక్షణసంలబ్ధసరసకవితా
సామ్రాజ్యధురంధర ఘనయశోబంధుర కౌండిన్యసగోత్రపవిత్ర కూచిమంచి
గంగనామాత్యపుత్త్ర సకలసంస్కృతాంధ్రలక్షణకళాకౌశలాభిరామ
తిమ్మకవిసార్వభౌమప్రణీతం బైనసర్పపురక్షేత్రమాహాత్మ్యం
బనుపుణ్యచరిత్రంబునందు సర్వంబును
దృతీయాశ్వాసము.